విలేఖరులు
కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాధాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394
సంప్రదించగలరు ఎడిటర్ చల్లా శ్రీకాంత్

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 251 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | మంగళవారం 15 అక్టోబర్ 2024 | పేజీలు : 8 | వెల :రూ 2-00

GUNTUR | VOL-01 | ISSUE - 251 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 15 TUESDAY SEPTEMBER 2024 | PAGES : 8 | Rs :2-00

# ఆంధ్రప్రదేశ్‌కి వర్ష సూచన.. తితిదే కీలక నిర్ణయాలు



తిరుమల: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. విపత్తు నిర్వహణ ప్రణాళికపై తితిదే అడిషనల్ ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి ఈవో శ్యామలరావు వర్చువల్ విధానంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. రాగల 36 గంటల్లో భారీ వర్ష సూచనపై సమావేశంలో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో తితిదే జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఇతర విభాగాధిపతులు, జిల్లా పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా శ్రీవారి ఆలయంలో 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 15న సిఫార్సు లేఖలు అనుమతించకూడదని, అలాగే భక్తుల భద్రత దృష్ట్యా బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. అధికారులందరూ విపత్తును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని ఈవో సూచించారు. 2021లో భారీ కొండ చరియలు విరిగి పడిన ఘటనతో తితిదే 700 పేజీల విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ ప్రణాళిక మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని అధికారులకు చెప్పారు. ఈవో స్థాయిలో విపత్తుల నివారణ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అడిషనల్ ఈవో ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సమన్వయ కమిటీ ఉందన్నారు. అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, విజిలెన్స్ విభాగం, ఇతర కీలకమైన శాఖల విభాగాధిపతులు తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. "ఘాట్ రోడ్లపై ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. విద్యుత్ అంతరాయం ఏర్పడితే జనరేటర్లు నడపడానికి ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలి. ఐటీ విభాగం వారు భక్తులకు వసతి, దర్శనం, ప్రసాదాల తయారీ కార్యాకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే చర్యల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ అంబులెన్సులను అందుబాటులో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలి. ఇంజనీరింగ్ విభాగం వారు డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలి. ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలి. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే వేగంగా స్పందించేందుకు అగ్ని మాపక సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రజా సంబంధాల విభాగం వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఎస్వీబీసీ, మీడియా, తితిదే సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ భక్తులను అప్రమత్తం చేయాలి" అని అధికారులను ఈవో ఆదేశించారు.

# 'ఉద్యోగ కల్పన ప్రథమ లక్ష్యం'.. ఇదే ప్రభుత్వ విధానం: చంద్రబాబు



అమరావతి: 'ఉద్యోగ కల్పన ప్రథమ లక్ష్యం' అనేదే ప్రభుత్వ విధానమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మార్గం సుగమం చేసేలా పాలసీలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక అభివృద్ధి, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ డ్రాఫ్ట్ పాలసీలపై సచివాలయంలో అధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కొత్త పాలసీతో భారీగా పెట్టుబడులు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. సమగ్ర మార్పులతో 7-8 శాఖల్లో కొత్త పాలసీలకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని చంద్రబాబు అన్నారు. కొత్త పాలసీలపై అధికారులు 3 నెలలుగా సమగ్ర కసరత్తు చేశారు. ముఖ్యమంత్రి సూచనలు, పరిశ్రమ వర్గాల అభిప్రాయాలు, ఇతర రాష్ట్రాల విధానాల ఆధారంగా వివిధ డ్రాఫ్ట్ పాలసీలు రూపొందించారు. ప్రతి పాలసీ తయారీలో తన అనుభవాలు, ఆలోచనలు పంచుకున్న ముఖ్యమంత్రి... ఏ రాష్ట్రంతో పోల్చుకున్నా ఏపీ పారిశ్రామిక విధానం అత్యుత్తమంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. పారిశ్రామిక అభివృద్ధి నూతన పాలసీ, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు తీసుకొస్తామని చంద్రబాబు తెలిపారు. పాలసీలు అమల్లోకి వచ్చిన వెంటనే పెట్టుబడిదారులకు అదనపు ప్రోత్సాహకాలు ఇచ్చేలా డ్రాఫ్ట్ పాలసీలో ప్రతిపాదనలు చేశారు. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే సంస్థలకు అదనంగా 10శాతం ప్రోత్సాహకం ఇచ్చేలా ఇండస్ట్రియల్ పాలసీ ఉండనుంది. 'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామిక వేత్త' అనే కాన్సెప్ట్‌తో ఎంఎస్ఎంఈ పాలసీ ఉండాలని చంద్రబాబు తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పేరుతో పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రత్యేక హబ్ తీసుకురావాలని నిర్ణయించారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, ఫెసిలిటేషన్‌ల కేంద్రంగా అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయను న్నారు. రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో హబ్‌కు అనుబంధ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో సెంటర్‌కు ఒక్కో మల్టీనేషనల్ కంపెనీ మెంటార్‌గా ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆక్వా, పౌల్ట్రీ రంగంలో వచ్చిన విధంగా ఫుడ్ ప్రాసెసింగ్‌లోనూ ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు అవసరమైన విధానాలపై చర్చించారు. ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా వ్యాపారవేత్తలకు అదనంగా 5 శాతం ఇన్సెంటివ్ వచ్చే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ పాలసీపైనా చర్చిం చారు. మరింత కసరత్తు తరువాత కేబినెట్ ముందుకు ఈ పాలసీ రానుంది.

# భాగమతి రైలు ప్రమాదం.. సమాచారం ఉంటే వెల్లడించండి



చెన్నై: ఈనెల 11న తమిళనాడులోని కవరైపెట్టై రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలును మైసూరు- దర్భంగా ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడిన సంగతి తెలిసిందే. కాగా ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది. ఈ నెల 16, 17వ తేదీల్లో భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంపై చెన్నైలో రైల్వే ఉన్నతాధికారులు దర్యాప్తు చేయనున్నారని రైల్వే ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఘటనకు సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే ప్రజలు తమను సంప్రదించాలని దక్షిణ రైల్వే సోషల్ మీడియా వేదికగా ప్రకటన వెలువరించింది. రైలు ప్రమాదంపై అధికారులు భిన్న కోణాల్లో విచారణ జరుపుతున్నారు. ప్రమాదానికి కారణం సాంకేతిక లోపమా? సిగ్నలింగ్ వైఫల్యమా? కుట్ర కోణమా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఎవరి వద్ద అయినా ఆధారాలు ఉంటే..వాటితో పాటు చట్టబద్ధమైన విచారణకు హాజరు కావాలని కోరారు. కాగా ఈ కేసు విచారణ పార్క్ టౌన్‌లోని చెన్నై డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం)

# మద్యం నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: కొల్లు రవీంద్ర



అమరావతి: గత ప్రభుత్వం మద్యం విధానాన్ని భ్రష్టుపట్టించిందని ఏపీ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. తయారీ నుంచి విక్రయాల వరకు అన్నీ ప్రభుత్వ అధీనంలోనే పెట్టుకున్నారని అన్నారు. సొంత బ్రాండ్లను ప్రమోట్ చేసుకొని దోపిడీ చేశారని దుయ్యబట్టారు. తాజాగా మద్యం విధానాలపై సబ్‌కమిటీ అధ్యయనం చేసి, తక్కువ ధరకు నాణ్యమైన మద్యం ఇచ్చేలా విధానం రూపొందించిందని అన్నారు. అన్ని మద్యం బ్రాండ్లను ప్రమోట్ చేసుకోవాలని చెప్పారు. "ప్రభుత్వంపై నమ్మకంతోనే మద్యం దుకాణాల కేటాయింపునకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. గుడికి, బడికి 100 మీటర్ల పరిధిలో మద్యం దుకాణాలు ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలిచ్చాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ఆ దుకాణాలను మూసివేయిస్తాం. గత ప్రభుత్వంతో పోలిస్తే పోలీస్ వ్యవస్థ పటిష్ఠంగా తయారైంది. బెల్ట్ షాపులు నిర్వహిస్తే తీవ్ర చర్యలుంటాయి" అని కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# మహారాష్ట్రలో అండర్ వరల్డ్ డాన్‌ల ప్రభావం పెరుగుతోంది: సంజయ్ రౌత్



ముంబయి: ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, సల్మాన్‌ఖాన్ స్నేహితుడు బాబా సిద్ధిఖీ హత్య నేపథ్యంలో శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత మహాయుతి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో గ్యాంగ్ వార్‌లు, అండర్ వరల్డ్ డాన్‌ల ప్రభావం పెరుగుతోందని దుయ్యబట్టారు. ఈ కుట్రలు గుజరాత్‌లో జరుగుతున్నాయని అన్నారు. ఇటీవల గుజరాత్‌లో రూ. 5,000 కోట్ల విలువైన డ్రగ్స్ లభ్యమైన విషయం గురించి ప్రస్తావిస్తూ అంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుబడ్డాయంటే ఇంకా దేశంలో ఏ స్థాయిలో డ్రగ్స్ పంపిణీ అయ్యుంటాయో అని అనుమానం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి గుజరాత్‌కు చెందిన అండర్ వరల్డ్ డాన్‌ల మద్దతు ఉందని సంజయ్ రౌత్ ఆరోపించారు. నిజంగా వారితో ఎటువంటి సంబంధాలు లేకపోతే సిద్ధిఖీ హత్యకు కుట్ర పన్నిన వారికి శిక్ష విధించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేకు సవాలు విసిరారు. "బద్లాపూర్ లైంగిక వేధింపుల కేసులో చర్య తీసుకున్న తర్వాత శిందే తనను తాను సింహమని ప్రకటించుకున్నారు. అదే నిజమైతే, ఆయనకు ధైర్యముంటే సిద్ధిఖీ హత్యకు కుట్రపన్నిన వారిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలి" అని రౌత్ అన్నారు. ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ శనివారం రాత్రి తన కుమారుడి కార్యాలయం ముందు టపాసులు కాలుస్తున్న సమయంలో హరియాణాకు చెందిన గుర్మయిల్ బల్జిత్ సింగ్, యూపీకి చెందిన ధర్మరాజ్‌రాజేష్ కశ్యప్ అనే యువకులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన ఆసుపత్రిలో కన్నుమూశారు. ఈ కేసులో అరెస్టయిన హరియాణాకు చెందిన కర్నైల్ సింగ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మరాజ్ కశ్యప్ అనే ఇద్దరు నిందితులు తాము లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందినవారమని పేర్కొన్నారు. అనంతరం సిద్ధిఖీని హత్య చేసింది తామే అని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. ఈ హత్య నేపథ్యంలో రాష్ట్రంలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై సీఎం ఏక్‌నాథ్ శిందే స్పందించారు. హత్యకు పాల్పడింది బిష్ణోయ్ గ్యాంగ్ అయినా..మరే ఇతర అండర్ వరల్డ్ సంస్థ అయినా తమ నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

# బలమైన నాయకత్వంతో ఏపీకి మంచి రోజులు: డిప్యూటీ సీఎం పవన్

కంకిపాడు: ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పల్లె పండగ' వారోత్సవాలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. కృష్ణా జిల్లా కంకిపాడులో దీనికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా పవన్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. రూ. 95.15 లక్షలతో రోడ్లు, మినీ గోకులాలు, పునాదిపాడులో రూ. 52 లక్షలతో 2 అంతర్గత రహదారులు, రూ. 54 లక్షలతో సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ నిర్మాణానికి శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు. "మా ఆకాంక్ష అంతా ఒక్కటే. రాష్ట్రంలోని ప్రజలంతా బాగుండాలి. యువతకు ఉపాధి అవకాశాలు రావాలి.. పల్లెల్లో వెలుగులు నిండాలి. ఇవన్నీ జరగాలంటే వైకాపా ప్రభుత్వం దిగిపోవాలని గట్టిగా కృషి చేశాం. బలమైన నాయకత్వం వల్ల రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయి. సంకల్పంతో ముందుకెళ్లాం.. అనుకున్న విజయాన్ని సాధించాం. రాష్ట్ర శ్రేయస్సు కోసం బలంగా ఉన్నప్పుడే అనుకున్నది సాధ్యమవుతుంది. ఒకేరోజు 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాం. దేశంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఇప్పటికే పంచాయతీ తీర్మానాలు చేసిన పనులకు పరిపాలన, సాంకేతిక ఆమోదం ఇచ్చాం. రూ. 4,500 కోట్ల నిధులు విడుదల చేస్తున్నాం. పంచాయతీల్లో పనులపై డిస్‌ప్లే బోర్డులు ఉండాలి. దాపరికం లేకుండా అన్ని వివరాలు అందులో కనిపించాలి. మేం ఎంత పారదర్శకంగా ఉన్నా.. వ్యవస్థలో వ్యక్తులు కూడా బలంగా ఉండాలి"అని పవన్ అన్నారు.

**చంద్రబాబు నాకు స్ఫూర్తి.. ఆయన అనుభవం రాష్ట్రానికి బలం**



నాలుగోదఫా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాకు స్ఫూర్తి. ఆయన అపారమైన అనుభవం రాష్ట్రానికి బలం. నాయకుడి కష్టం, అనుభవం రాష్ట్ర శ్రేయస్సుకు ఉపయోగించుకోకపోతే తప్పు చేసినవాళ్లం అవుతాం. అందుకే ఆరోజు కలిసి వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నా. అప్పుడు తీసుకున్న నిర్ణయం సరైనదేనని అనిపిస్తోంది. తెదేపా, భాజపా, జనసేన బలంగా నిలబడటం వల్లే ఇది సాధ్యమైంది. ప్రధాని మోదీ ఆశీస్సులు, భాజపా నేతల బలం కూటమి ప్రభుత్వానికి మేలు చేకూర్చుతాయి. క్యాబినెట్ సహా అధికారులతో జరిగే సమావేశాల్లో చూస్తుంటా. వివిధ అంశాలపై చంద్రబాబు చాలా బలంగా మాట్లాడుతుంటారు. శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండలనేదానిపై దిశానిర్దేశం చేస్తుంటారు. కొన్ని అభివృద్ధి పనులు చేసేటప్పుడు పంచాయతీరాజ్ శాఖ చాలా శాఖలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. కాకినాడలో ఓ ఐఎఫ్ఎస్ అధికారి మా పేరు చెప్పి డబ్బులు అడుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని.. అవసరమైతే సస్పెండ్ చేయాలని ఆదేశించాను. ఈ ప్రభుత్వంలో అలాంటి వ్యక్తుల ప్రమేయం ఉండొద్దని స్పష్టంగా చెప్పాను. లంచాల ప్రభుత్వం కాదిది.. నిలబడే ప్రభుత్వం'' అని ఆయన వ్యాఖ్యానించారు. గుడివాడ నియోజకవర్గంలో 43 గ్రామాల్లో నీటి సమస్యను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తన దృష్టికి తీసుకొచ్చారని పవన్ తెలిపారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు బూతులు, శాపనార్థాలు తప్ప ఈ నీటి సమస్య గురించి పట్టించుకోలేదని మండిపడ్డారు. వెంటనే గ్రామీణ నీటి సరఫరా అధికారులు ప్రతీ గ్రామానికి బృందాలను పంపి నీటి నాణ్యత పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సంవత్సరానికి రూ. 10 వేల కోట్లు ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రానికి నిధులు వస్తాయని, దీనిద్వారా నైపుణ్యం లేని వ్యక్తులకు ఉపాధి అందించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పని చేయడానికి సిద్ధంగా ఉన్నవారికి 15 రోజుల్లో పని కల్పించడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. 15 రోజుల్లోగా పని కల్పించకపోతే నిరుద్యోగ భృతిని అందించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనన్నారు. దానికి అనుగుణంగా ప్రతీఒక్కరికీ ఉపాధి కల్పించేలా పని చేస్తున్నట్లు తెలిపారు.

## సినిమా రంగంలో ఎవరితోనూ పోటీ పడను..: పవన్‌కల్యాణ్

సినిమా రంగంలో తనకు ఎవరితోనూ పోటీ లేదని సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో నిర్వహించిన 'పల్లె పండుగ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

# డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయండి..

## క్యాట్‌లో ఐఏఎస్ అధికారుల పిటిషన్లు




దిల్లీ: కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఆదేశాలతో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లలో కొనసాగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పునర్విభజన చట్టం ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు డీఓపీటీ కార్యదర్శి ఆదేశాలు సైతం జారీ చేశారు. అయితే డీఓపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ పలువురు ఐఏఎస్ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన క్యాట్‌లో వేర్వేరుగా పిటిషన్‌లు దాఖలు చేశారు. తెలంగాణలో కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి కోరారు. ఏపీలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఐఏఎస్ అధికారిణి సృజన కోరారు. వారి పిటిషన్లపై కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ మంగళవారం విచారణ చేపట్టనుంది. ఏపీకి కేటాయించి తెలంగాణలో కొనసాగుతున్న వారిలో ఐఏఎస్ అధికారులు వాణీప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి, ప్రశాంతి, ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన వారిలో ఐఏఎస్ అధికారులు సృజన, శివశంకర్, హరికిరణ్ ఉన్నారు. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లాలని దరఖాస్తు పెట్టుకున్న ఎస్.ఎస్.రావత్, అనంతరాము అభ్యర్థనలను డీవోపీటీ తిరస్కరించింది. వీరిద్దరూ ఆంధ్రాలోనే కొనసాగుతారు.

# ఎడిటోరియల్

## పొరలు ఒలిచే రచయిత

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది గెలుచుకోవడం ద్వారా ఆ గౌరవం పొందిన తొలి ఆసియా రచయిత్రిగా నిలిచింది దక్షిణ కొరియాకు చెందిన హాన్ కాంగ్ (సరైన ఉచ్చారణ: హన్ గాన్ ).ప్రతి ఏడాదీ జరిగినట్టుగానే ఈసారీ అందరి అంచనాలు తలకిందులైనాయి. చైనా రచయిత్రి కాన్ షుయె, ఆస్ట్రేలియా రచయిత జెరాల్డ్ మర్నేన్, జపాన్ రచయిత హరూకి మురకామి నుంచి భారత మూలాలున్న సల్మాన్ రష్దీ వరకు ఎవరిని వరించొచ్చనే విషయంలో బెట్టింగ్స్ నడిచాయి.కానీ 'చారిత్రక విషాదాలను ప్రతిఘటించే, మానవ దుర్బలత్వాన్ని ఎత్తి చూపే తీక్షణమైన కవితాత్మక వచనానికి'గానూ హాన్ కాంగ్‌కు ఈ పురస్కారాన్ని ప్రకటించింది స్వీడిష్ అకాడెమీ. 2016లో తన కొరియన్ ఆంగ్లానువాద నవల 'ద వెజిటేరియన్ 'కు 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్' గెలుచుకున్న హాన్ కాంగ్ ఆ పురస్కారం పొందిన తొలి కొరియన్ రచయిత కూడా కావడం విశేషం.దక్షిణ కొరియా ప్రసిద్ధ రచయిత హాన్ సుయెంగ్–వొన్ కూతురిగా 1970లో జన్మించిన హాన్ కాంగ్ సాహిత్య ప్రయాణం– మనుషుల్ని మనుషులే పీక్కు తినే ఈ సమాజంలో దానికి విరుగుడు ఏమిటనే శోధనతో మొదలైంది. 'మనుషులు మొక్కలు కావాల్సిందని నా నమ్మకం' అంటాడు 28 ఏళ్లకే క్షయ వ్యాధితో మరణించినప్పటికీ కొరియన్ సాహిత్య రంగం మీద ప్రబలమైన ముద్రవేసిన యీ సంగ్.అదొక నిరసన! ప్రస్తుతం సుమారు ఐదు కోట్ల జనాభా ఉన్న దక్షిణ కొరియా చరిత్రలో మాయని మచ్చలైన జపాన్ దురాక్రమణ (1910–45), కొరియన్ యుద్ధం(1950–53) తర్వాత, అలాంటిదే– సైనిక పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన విద్యార్థుల తిరుగుబాటు (1980)ను అణచివేసే క్రమంలో జరిగిన 'మే 18' ఘటన. కాంగ్‌కు తొమ్మిదేళ్లున్నప్పుడు ఆమె జన్మించిన గ్వాంగ్జు పట్టణం నుంచి వాళ్ల కుటుంబం సియోల్‌కు వెళ్లిపోయింది.సరిగ్గా నాలుగు నెలల తర్వాత అక్కడ వేలాది విద్యార్థులు, పౌరులు చనిపోయారు. తనకు ప్రత్యక్షంగా అనుభవం లేని ఈ ఘోరాలను పెద్దయ్యాక తెలుసుకునే క్రమంలో అంతులేని పశ్చాత్తాపానికి గురైంది కాంగ్. వాళ్ల కుటుంబం బతికుండటానికీ, ఇంకో కుటుంబం లేకుండాపోవడానికీ కారణమే లేదు. ఒక చిన్న నిర్ణయం వాళ్ల గతిని మార్చింది. గ్వాంగ్జు, ఆష్విట్స్, బోస్నియా– ప్రపంచమంతటా ఇదే హింస.అయితే, గాయాల పాలైనవారికి రక్తం ఇవ్వడం కోసం తమ భద్రతకు కూడా వెరవకుండా వేలాది మంది ఆసుపత్రుల ముందు వరుసలు కట్టిన ఫొటోలు కాంగ్‌లో ఉద్వేగాన్ని పుట్టించాయి. వర్తమానం గతాన్ని కాపాడుతుందా? బతికున్నవాళ్లు పోయినవాళ్లను కాపాడగలరా? 'దొరక్కపోయినా జవాబుల కోసం రచయితలు వెతకడం మానరు'.ఎంతటి క్రౌర్యానికైనా మనిషి వెనుదీయడుబీ అదే సమయంలో, 'రైల్వే ట్రాక్ మీద పడిపోయిన పసికందును కాపాడటానికి తన ప్రాణాలను సైతం లెక్కించడు'. మనిషిలోని ఈ రెండు ముఖాల ప్రహేళికను చిత్రిస్తూ 'హ్యూమన్ యాక్ట్స్' నవల రాసింది కాంగ్. రచనల్లో రాజకీయ ప్రకటనలు చేయాల్సిన అవసరం లేకుండా– మనిషిలోని అంతులేని క్రూరత్వాన్నీ, దాని మరుగునే ఉన్న మృదుత్వాన్నీ తవ్వి తీసింది.పుట్టిన రెండు గంటలకే చనిపోయి తన తల్లిదండ్రులు ఎన్నటికీ బయటపడలేని దుఃఖానికి కారణమైన తను ఎన్నడూ చూడని తన 'అక్క' హాన్ కాంగ్‌కు ఓ పుండులా మిగిలిపోయింది. 'గాయం అనేది మాన్చుకోవాల్సిందో, బయటపడాల్సిందో కాదుబీ దాన్ని ఆలింగనం చేసుకోవాలి' అంటుందామె. కాలం వల్ల, మరణం వల్ల, ఇతర విషాదాల వల్ల మనుషులు ఇతరులతో సంభాషించే శక్తిని కోల్పోతారు.అంధత్వం వల్ల రాయగలిగే, చదవగలిగే సామర్థ్యాన్ని కోల్పోయిన ఒక ప్రాచీన–గ్రీకు బోధకుడు, తీవ్ర కుటుంబ విషాదాల వల్ల నోరు లేకుండాపోయిన ఆయన విద్యార్థిని పరస్పరం సమాచారాన్ని పంచుకోవడానికి చేరుకునే గౌరవపూరిత సామీప్యతను చిత్రించడానికి 'గ్రీక్ లెసన్ ్స' నవల రాసింది కాంగ్. మనిషికీ మనిషికీ మధ్య ఉండాల్సిన 'నిరంతర మృదు స్పర్శ'ను నొక్కి చెప్పింది. తద్వారా భాషా సూక్ష్మతనూ, గెలుచుకోగలిగే జీవన సౌందర్యాన్నీ పట్టిచూపింది.హాన్ కాంగ్ ఎంత వేగంగా టైప్ చేయగలదంటే, 'నమ్మండి నమ్మకపోండి' లాంటి టీవీ షోలో పాల్గొనమని ఆమె మిత్రులు నవ్వుతూ అనేంతగా! ఆమె రచనల్లోని ధారకు సరితూగేట్టుగా టైప్ చేసే క్రమంలో పుట్టిన నొప్పులకు కొన్నాళ్లు వేళ్లు కదపలేని పరిస్థితి వచ్చింది. మణికట్టు నొప్పి వల్ల పెన్నుతోనూ రాయలేదు. కొంతకాలం పెన్నును తిరగేసి పట్టుకుని ఒక్కో అక్షరాన్ని నొక్కుతూ టైప్ చేసేది.కవయిత్రిగా మొదలైన కాంగ్‌కు సంగీతమూ తెలుసు. పాటలు రాసి, తానే స్వరపరిచి, ముందు వద్దనుకున్నా ఆ తర్వాత ఆ మొత్తం పాడి ఒక పది పాటల సీడీ విడుదల చేసింది. ఆమె రచనల్లోనూ ఈ సంగీతం మిళితమై ఉంటుంది. 1993లో మొదలైన కాంగ్ మూడు దశాబ్దాల సాహిత్య ప్రయాణంలో నవలలు, నవలికలు, కథలు, కవితలు, వ్యాసాలు రాసింది. ఎన్నో పురస్కారాలను అందుకుంది.తరచూ వేధించే తీవ్రమైన తలనొప్పులు తనను అణకువగా ఉంచడంలో సాయపడుతున్నాయంటుంది. ఆమెకు ఒక కొడుకు. నోబెల్ వార్త తెలిసినప్పుడు అతడితో కలిసి కాఫీ తాగుతోందట. 2114 సంవత్సరంలో ప్రచురించనున్న 'ఫ్యూచర్ లైబ్రరీ ప్రాజెక్ట్' కోసం 'డియర్ సన్, మై బిలవ్డ్' సమర్పించిందామె. అందులో ఏం రాసివుంటుంది? మనిషి హింసను ఎదుర్కొనే సున్నిత ప్రతీకారం మరింత మానవీయతను చూపడమేనని మరోసారి నొక్కి చెప్పివుంటుందా!

# నూతన మద్యం దుకాణాల కేటాయింపు పారదర్శకతతో చేపట్టాం




రాయల్ జర్నలిజం (బాపట్ల) అక్టోబర్ 14 : నూతన విధానం ద్వారా మద్యం దుకాణాల కేటాయింపులు పారదర్శకతతో చేపట్టామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియ సోమవారం స్థానిక ఎం.ఎస్.ఆర్ కళ్యాణ మండపంలో జరిగింది. మద్యం దుకాణాలకు అత్యధికంగా టెండర్లు రావడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒక కౌంటర్ వద్ద జిల్లా కలెక్టర్ వెంకట మురళి హాజరు కాగా అధికారులు టెండర్ బాక్స్ లను తెరిచారు. మరొక కౌంటర్ వద్ద జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ హాజరు కాగా ఎక్సైజ్ అధికారులు టెండర్ బాక్స్ లను తెరిచారు. బాపట్ల జిల్లాలో 117 దుకాణాలకు 2,149 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటించారు. అనంతరం ఒక్కొక్క దుకాణానికి అత్యంత పారదర్శకంగా లాటరీ నిర్వహించారు. లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా, ప్రజల శ్రేయస్సును కోరుతూ మద్యం దుకాణాల కేటాయింపులలో అందరికీ సమాన అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన మద్యం



అందించడానికే నూతన విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఏ వ్యక్తి అయినా, ఎన్ని దరఖాస్తులు అయినా, ఎక్కడి నుంచి అయినా టెండర్ వేసే అవకాశం కల్పించామన్నారు. ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ప్రజా శ్రేయస్సు కొరకు మద్యం నూతన విధానాన్ని అమలు చేసిందన్నారు. అధికారులు, మద్యం వ్యాపారులు, మద్యం వ్యాపారం పై ఆసక్తి ఉన్నవారు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషదాయకమన్నారు. దరఖాస్తుదారులంతా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో సహకరించారన్నారు. అధికారులు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. చట్టబద్ధంగా నిర్వహించే కార్యక్రమంలో అధికారులు, వ్యాపారుల సహకారం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మద్యం నూతన విధానాన్ని పక్కాగా అమలయ్యేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, గంటా దేవదత్తు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు, ఆర్ డి.ఓ.పి గ్లోరియా, ఎక్సైజ్ శాఖ సి ఐ, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన శ్రీ చౌడేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాలు

***గత తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు ఎన్ వి ఆర్ ట్రస్ట్ క్రికెట్ విజేత గోపిశెట్టిపల్లి***

***జబర్దస్త్ టీం, పల్సర్ బైక్ రమణ టీం, డి విన్నర్ టీం తో గత తొమ్మిది రోజులుగా పెద్ద పెద్ద కళాకారుల చేత ప్రోగ్రాం నిర్వహణ***

***వేలాది మందికి అన్నదాన కార్యక్రమం ఇది వేణుగోపాల్ రెడ్డి గొప్పతనం***



రామసముద్రం.అక్టోబర్ 14 రాయల్ జర్నలిజం.పుంగనూరు మండలంలోని చదళ్ళు గ్రామంలో వెలసిన శ్రీ సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరీ దేవి నవరాత్రి ఉత్సవాలు శనివారం వైభవంగా పూర్తయ్యాయి. శనివారం మూలవిరాట్టుకు శ్రీ చాముండేశ్వరి దేవి అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వైదికులు అమ్మవారికి శ్రీ చౌడేశ్వరి హోమం జయాధి హోమం ప్రాయశ్చిత్త హోమం మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఉషశ్రీ దంపతులచే మహా కుంభాభిషేకం మంత్రపుష్పం మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాది క్రతువులలో పాల్గొన్న భక్తులకు ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యదర్శి శివకుమార్ రెడ్డి వారి బృందం చే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు వైభవంగా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి సహకరించిన రుత్వికులకు నిర్వాహకులకు భక్తులకు ప్రజలకు వేణుగోపాల్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

**ఎన్వీఆర్ క్రికెట్ కప్ విజేత గోపిశెట్టిపల్లి**

శ్రీ చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్వీఆర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ జరుగుతున్న సంగతి తెలిసిందే గత తొమ్మిది రోజులుగా గ్రామంలో జరుగుతున్న ఎన్టీఆర్ క్రికెట్ టోర్నమెంట్లో విజేతలుగా మండలానికి చెందిన గోపిశెట్టిపల్లి యూత్ క్రికెటర్ అసోసియేషన్ నిలిచింది. మొత్తం 62 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్లో పోటీలు తొలి రోజు నుంచి తుదిరోజు వరకు నిత్యం హోరాహోరీగా జరిగింది ఫైనల్స్లో గోపిశెట్టిపల్లి , ఏదూరు టీంలు తలపడ్డాయి. విజేతగా నిలిచిన గోపిశెట్టిపల్లి క్రికెట్ జట్టు రూ.50,116, రన్నర్స్ గా నిలిచిన ఏదూరు జట్టు రూ.30,116 బహుమతులు దక్కించుకున్నాయి మూడవ స్థానంలో ఫార్మర్స్ ఆర్మీ క్రికెట్ జట్టు 15,116 రూపాయలు దక్కించుకుంది. వీరికి ఎన్వీఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి కార్యదర్శి శివకుమార్ రెడ్డి సభ్యులు బహుమతులు అందజేశారు.



# రాయుడు కాలనీలో విద్యార్థిని ఆత్మహత్య..



రాయల్ జర్నలిజం రాయచోటి అక్టోబర్ 14:రాయచోటి పట్టణం డైట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు..విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు,పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# నిబంధనలకు విరుద్ధంగా సంఘమిత్ర ఎన్నిక..

***డ్వాక్రా సంఘాలకు కనీస సమాచారం ఇవ్వకుండా సంఘమిత్రను నియమించిన సి సి, ఎ పి యం లు..***




రాయల్ జర్నలిజం (రాయచోటి) అక్టోబర్ 14: నిబంధనలకు విరుద్ధంగా సంఘమిత్ర ఎన్నిక జరిగిందంటూ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైటయించిన తంబళ్లపల్లి పల్లి మండలం, కన్నెమడుగు గ్రామపంచాయతీకి చెందిన డ్వాక్రా సంఘాలు.నియంతల వ్యవహరిస్తున్న నూతనంగా ఎన్నుకున్న సంఘమిత్ర...డ్వాక్రా సంఘ సభ్యుల అంగీకారం లేకుండా నూతన సంఘమిత్ర నియామకం జరిగిందంటూ ఆవేదన.కనీసం డ్వాక్రా మహిళా సంఘాలలో సభ్యత్వం లేని వ్యక్తి ని సంఘమిత్రగా నియమించడం వెనక ఆంతర్యమేంటంటున్న డ్వాక్రా సంఘాలు.సమర్థవంతమైన సంఘమిత్రను ఎన్నుకునే హక్కును తమకు కల్పించాలంటూ 27 సంఘాలతో కలిసి జిల్లా కలెక్టర్ ని ఆశ్రయించిన డ్వాక్రా మహిళలు..డ్వాక్రా మహిళల సమస్యలు తెలిసిన సమర్థవంతమైన సంఘమిత్రను ఎన్నుకునే హక్కు తమకు కల్పించాలంటూ తంబళ్లపల్లి మండలం, కన్నె మడుగు గ్రామపంచాయతీకి చెందిన డ్వాక్రా మహిళలు అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ని ఆశ్రయించారు. గతంలో పని చేసినటువంటి సంఘమిత్ర అనారోగ్య కారణంగా ఇటీవల కాలంలో మరణించడంతో నిబంధనలకు విరుద్ధంగా సి సి, ఎ పి యం లు కలసి అర్హత లేని వ్యక్తిని నియమించారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించిన లీడర్లు అందరూ కలిసి డ్వాక్రా సంఘంలోని వ్యక్తిని సంఘమిత్రగా ఎన్నుకునే వారని అందుకు విరుద్ధంగా డ్వాక్రా సంఘాలకు, డ్వాక్రా మహిళలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కనీసం డ్వాక్రా గ్రూప్ లో కూడా లేని మహిళను సంఘమిత్ర గా నియమించడం వెనక ఆంతర్యమేంటో తెలియడం లేదన్నారు. నూతనంగా ఎన్నుకున్న సంఘమిత్ర నియంతల వ్యవహరిస్తుందన్న కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తద్వారా డ్వాక్రా సంఘాలు నెలవారి ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించడం లేదని దీని కారణంగా డ్వాక్రా సంగాలతో పాటు ప్రభుత్వానికి కూడా నష్టం వాటిల్లుతుందన్నారు. మహిళలు నిర్వహిస్తున్నటువంటి డ్వాక్రా సంఘాలలో సంబంధంలేని పురుషులు ప్రవేశించి తమపై యజమాయిషి చేస్తున్నారని తెలిపారు. ఇదే విషయమై గత నెలలో గ్రీవెన్సెల్ లో తమ సమస్యను తెలియజేసిన ఎటువంటి ప్రయోజనం కనిపించలేదని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వారు తమ సమస్యకు పరిష్కారం చూపి ప్రభుత్వ అధికారుల సమక్షంలో సంఘమిత్రను ఎన్నుకొనే హక్కును తమకు కల్పించాలంటూ కన్నెమడుగు గ్రామ పంచాయతీకి చెందిన 27 సంఘాల డ్వాక్రా మహిళలతో కలసి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ కు వినతి పత్రాన్ని అందజేశారు.

# ఆధార్ కార్డులు లేని ఎస్టీలను గుర్తించి తక్షణమే

## ఆధార్ కార్డు అందించాలి: జిల్లా కలెక్టర్



రాయల్ జర్నలిజం (బాపట్ల)అక్టోబర్ 14 : స్మశాన భూములు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై వినతి పత్రాలను అందించి న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. సమాజంలో అన్నింటిలోనూ వెనుకబడిన ఎస్సీ , ఎస్టీలను గుర్తించి వారి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. గ్రీవెన్స్ లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పి.జి.ఆర్.ఎస్ పై అధిక ప్రాధాన్యత చూపాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. నేటికీ ఆధార్ కార్డ్ లేని ఎస్టీలను గుర్తించి తక్షణమే ఆధార్ కార్డు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సి. హెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి గ్లోరియా, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో



రామసముద్రం అక్టోబర్ 14 రాయల్ జర్నలిజం. మండలంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడి సంఘటన మండలంలోని కేసి పల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగింది.స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం, మాలిన తన పంచాయతీ మూగ ఎరపల్లికి చెందిన రమణ మరియు అతని కుమార్తె పుంగనూరు నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా కేసి పల్లి చెందిన జబ్బర్ మద్యం మత్తులో ఆటోలో పుంగనూరుకు వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి .ఆటో డ్రైవర్ స్పృహ కోల్పోవడంతో స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అనాధాశ్రమాన్ని ప్రారంభించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయల్ జర్నలిజం (రాయచోటి), అక్టోబర్ 14:రాయచోటి పట్టణంలోని తిరుపతి నాడు కాలనీ నందు నూతనంగా ఏర్పాటు చేసిన అనాధాశ్రమాన్ని సోమవారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ.... అర్చన స్కూల్ అధినేత మదన్మోహన్ రెడ్డి ఎంతోమంది అనాధలకు ఆశ్రయాన్ని కలిగిస్తూ అనాధాశ్రయాన్ని ఏర్పాటు చేయడం ప్రతి ఒక్కరు ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. మదన్మోహన్ రెడ్డి భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని.... సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు మదన్ మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన అధికారులు



రాయల్ జర్నలిజం ( కాకుమాను) ప్రభుత్వం ఇటీవల చేపట్టిన అధికారుల బదిలీల్లో భాగంగా కాకుమాను మండలానికి ఇద్దరు అధికారులు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇందిర క్రాంతి పదం కార్యాలయం ఏపీఎంగా సుజాత ఫిరంగిపురం మండలం నుండి బదిలీపై రాగా. పంచాయతీరాజ్ ఏఈగా రవీంద్ర రెడ్డి గుంటూరు ప్రత్యేక ఏఈ గా పనిచేసి సోమవారం తమ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరికి ఆ కార్యాలయ బృందం ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM



# అల్పపీడనం, భారీ వర్షాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



రాయల్ జర్నలిజం (బాపట్ల) అక్టోబర్ 14 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం భారీ వర్షాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్లో సోమవారం ఆయన సమావేశమయ్యారు. మండల స్థాయి అధికారులతోనూ వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆర్డీవో కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 18వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలతో మత్స్యకారులను సముద్రంలోకి వేటకు వెళ్ళనివ్వరాదని చెప్పారు. వేట కొరకు సముద్రంలోకి వెళ్లిన వారు తక్షణమే వెనుకకు వచ్చేలా మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సాగర్ మిత్రులకు తక్షణమే సమాచారం పంపాలన్నారు. సముద్రంలో మునగడానికి వచ్చే పర్యాటకులను తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను చీరాల, బాపట్లలో ఉంచాలని డిఆర్ఓ ను ఆదేశించారు. 19వ తేదీ వరకు అధికారులు, ఉద్యోగాలు ఎవరూ సెలవులు పెట్టరాదని, ఇప్పటికే సెలవుల్లో ఉంటే వారి సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతంలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో పునరావాస కేంద్రాలను ఎంపిక చేసుకోవాలన్నారు. అల్ప పీడనంతో ఎదురయ్యే విపత్తును ఎదుర్కోవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని చెరువులు, కాల్వల గట్లు బలహీనంగా ఉండి గండ్లు పడే ప్రాంతాలను జల వనరులశాఖ అధికారులు గుర్తించాలన్నారు. సమస్య పరిష్కారానికి తాత్కాలికంగా లేదా శాశ్వత మరమ్మత్తు పనులపై అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలన్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగితే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చూడాలన్నారు. నిత్యవసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలితే తక్షణమే తొలగించి పునరుద్ధరించడానికి యంత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రోక్లైన్లు, జనరేటర్లు వంటివి ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు, బాపట్ల చీరాల రేపల్లె ఆర్డీవోలు, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వ పాలన

### వేమూరు వైసిపి ఇన్చార్జ్ అశోక్ బాబు



వేమూరు, అక్టోబర్ 14 (రాయల్ జర్నలిజం) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన రాజ్యాంగానికి వ్యతిరేకంగా సాగుతుందని వేమూరు వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు విమర్శించారు, సోమవారం వేముల విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలు అందించకుండా కేవలం కక్ష సాధింపులు, రాజకీయ వేధింపులకే పరిమితమైందని విమర్శించారు, కూటమి ప్రభుత్వ మూడున్నర నెలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను నాయకులను జైలుకు పంపుతూ కక్ష సాధించే ధోరణిలో పని చేస్తుంది తప్ప తమను ఎన్నుకున్న ప్రజలకు మంచి చేద్దామని ఆలోచన లేకపోవడం దురదృష్టకరమన్నారు, కేవలం వైసీపీ నాయకులను టార్గెట్ గా చేసుకొని అక్రమ కేసులు బనాయిస్తూ వైసీపీ సానుభూతిపరులను భయభ్రాంతులకు గురి చేస్తూ అరాచక పాలన చేస్తుందని దియబట్టారు, దళితుడైన మాజీ ఎంపీ నందిగామ సురేష్ పై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిన విధానాన్ని ఆయన గుర్తు చేశారు, ప్రజలు అధికారాన్ని ఇచ్చింది సమర్థవంతమైన సంక్షేమ పాలన అందిస్తారని ఆలోచింప అవకాశం ఇస్తే చంద్రబాబు నాయుడు దానిని దుర్వినియోగపరుస్తూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఫలం చేస్తున్నారన్నారు ఇటువంటి విధానాలు సరియైనవి కాదని ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని ప్రజలకు సుభిక్షమైన పాలన అందించాలని అశోక్ బాబు తెలియజేశారు, కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సంబరాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే నిధులతో తామేదో గ్రామాలను బాగు చేస్తున్నాం అన్నట్టు చెప్పుకుంటుందన్నారు, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గత ఏడాది జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 11,000 కోట్లకు పైగా నిధులు తీసుకొస్తే, కూటమి ప్రభుత్వంలోని భాగస్వామి పవన్ కళ్యాణ్ తన మంత్రిత్వ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన ఉపాధి పథకం నిధుల్లో కోత పెట్టి కేవలం నాలుగున్నర వేల కోట్లు మాత్రమే ఉపాధి పథకం నిధులు సాధించారని ఎద్దేవా చేశారు, తామేదో బాగు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నటువంటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశలోకి తీసుకు వెళుతుందని విమర్శించారు, ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో హామీ ఇచ్చినటువంటి సూపర్ సిక్స్ పథకాలలో ఇంతవరకు ఒక్కటి అమలు చేసిన దాఖలాలు లేవన్నారు, ఇచ్చిన మాట నిలబెట్టుకునే అలవాటు చంద్రబాబు నాయుడు కు లేదనివిమర్శించారు,ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్



బాపట్ల ,అక్టోబర్ 14 ( రాయల్ జర్నలిజం) తుఫాను కారణంగా బాపట్ల పురపాలక సంఘం పరిధిలోని దిగువ ప్రాంత కాలనీలైన శారదాపూరి కాలనీ, వెన్నెలకంటి నగర్, రాజీవ్ గాంధీ కాలనీ, ఇందిరా నగర్ పరిసర ప్రాంతలలో మునిసిపల్ కమీషనర్ జి. రఘునాథ రెడ్డి పర్యటించారు. తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా ఎక్కడా కూడా నీరు నిల్వ లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు సూచించారు.నీరు నిల్వలు వున్నచోట వ్యాధులు ప్రభలకుండా యాంటి లార్వాల్ పిచికారి చేయాలన్నారు. తుఫాన్ తీవ్రమైతే పునరావాస కేంద్రాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. కమిషనర్ వెంట ఏ ఇ లు ఉమామహేశ్వరరావు ,ప్రసాదరావు , సెక్రెటరీలు పాల్గొన్నారు.

## ఎన్డిఏ ప్రభుత్వంలో పంచాయితీలకు మహర్దశ



రాయల్ జర్నలిజం (ఒంటిమిట్ట) అక్టోబర్ 14:ఒంటిమిట్ట మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు , రాష్ట్ర కాపు నాయకుడు వైఎల్ హైట్టుమ్మలగుంట ఈశ్వరయ్య కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు మహార్దశ పట్టనున్నట్లు ఒంటిమిట్ట మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలకుంట ఈశ్వరయ్యఅన్నారు. ఈ మేరక ఒంటిమిట్టలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీలను గాలికి వదిలేసి వాటి అభివృద్ధిని ఏనాడు పట్టించుకోలేదని అన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో ఉన్న డబల్ ఇంజన్ సర్కార్లో 15వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నుండి ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ స్థానిక సంస్థలకు 988.77 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. నేటి నుండి 20వ తారీకు వరకు సాగే పల్లె పండుగ పేరుతో గ్రామీణ పంచాయతీలలో ఉన్న అభివృద్ధి పనులకు ఈ నిధులతో శంకుస్థాపన చేస్తారని అన్నారు. రాష్ట్రంలో 3000 కిలోమీటర్ల సిమెంటు రోడ్ల నిర్మాణం, 500 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం,8 లక్షల కుటుంబాలకు వంద రోజుల పని, 25 వేల గోకులాలు పదివేల ఎకరాల్లో నీటి సంరక్షణ ట్రెంచులు నిర్మిస్తారని తెలిపారు.గ్రామ రాజ్యంతోనే రామ రాజ్యం నిర్మాణం అవుతుందని చెప్పిన గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని చెప్పారు

## అర్జీల పై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం: ఎస్పీ తుషార్ డూడి



రాయల్ జర్నలిజం (బాపట్ల ) అక్టోబర్ 14 : ప్రజల చట్టపరమైన సమస్యలు పరిష్కరించడానికి ప్రతి సోమవారం నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి నిర్వహించారు. కుటుంబ సమస్యలు, అత్తారింటి వేధింపులు, ఆర్థిక మోసాలు, భూవివాదాలు ఇతర పలు రకాల సమస్యలను చెప్పుకోవడానికి అర్జీ దారులు జిల్లా నలుమూలల నుండి ఎస్పీ నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి విచ్చేసినారు. ఎస్పీ వారితో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి అర్జీలను వేగవంతంగా విచారించి చట్టపరిధిలో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీ దారుల సమస్యను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రదాన కార్యాలయానికి పంపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అర్జీల పై చట్ట ప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ ప్రజలకు భరోసా కల్పించారు. ఈ రోజు ఎస్పీ గారు నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి మొత్తం 29 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పీ జి.రామాంజనేయులు, సిఐ యు.శ్రీనివాసులు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లాలో సజావుగా 144 మద్యం దుకాణాలకు పూర్తయిన లాటరీ ప్రక్రియ



ఏలూరు,రాయల్ జర్నలిజం, అక్టోబర్ 14 : జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ కె. వెట్రిసెల్వి వెల్లడించారు. సోమవారం ఉదయం స్థానిక చలసాని గార్డెన్స్ లో మద్యం దుకాణాల కేటాయింపునకు లక్కీడిప్ ప్రక్రియను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 8 గంటల ప్రారంభమైన లక్కీడిప్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పీ. ధాత్రిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రశాంతంగా నిర్వహించిన దుకాణాల లక్కీడిప్ ప్రక్రియ మధ్యాహ్నం 4 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శంగా మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు. పూర్తి ప్రక్రియను వీడియోగ్రఫి తో చిత్రీకరించినట్లు చెప్పారు. ఆయా షాపులకు టెండర్లు దాఖలు చేసిన దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీడిప్ తీసి షాపు దక్కించుకున్న వారి పేరును ప్రకటించినట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 144 మద్యం దుకాణాలకు 5,499మంది టెండర్లు దాఖలు చేయగా, 144 మద్యం షాపులకు లక్కీడిప్ ద్వారా 144 మందిని ఎంపిక చేసినట్లు కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏ.ఆవులయ్య, అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు,ఇన్చార్జి డి ఆర్ ఓ దేవకీదేవి,ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ,డిఎస్ డి.శ్రవణ్ కుమార్,పి జడ్పీ సీఈవో కె.సుబ్బారావు,డి అర్ డి ఏ పిడి ఆర్.విజయరాజు,డిఎస్ వో ఆర్ఎస్ఎస్ రాజు,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు యం.ముక్కంటి, కె.భాస్కర్ తహసీల్దార్ శేషగిరి,ఎక్సైజ్ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఏలూరు అర్బన్ ..21,ఏలూరు రూరల్ 4,దెందులూరు మండలం 4, పెదపాడు మండలం 11,చింతలపూడి నగర పంచాయతీ 2,చింతలపూడి రూరల్ 3,కామవరపుకోట మండలం 4,లింగపాలెం మండలం 4,టి.నరసాపురం మండలం 3,భీమడోలు మండలం 7,ద్వారక తిరుమల మండలం 5, ఉంగుటూరు మండలం 7, నిడమర్రు మండలం 3,జంగారెడ్డిగూడెం అర్బన్ 7, జంగారెడ్డిగూడెం రూరల్ 4, కుక్కునూరు మండలం 02, పోలవరం మండలం 3, కొయ్యలగూడెం మండలం 5, కైకలూరు మండలం 14, ముదినేపల్లి మండలం 5, మండవల్లి మండలం 3,నూజివీడు అర్బన్ 3,నూజివీడు రూరల్ 4,ఆగిరిపల్లి మండలం 4,చాట్రాయి మండలం 2,ముసునూరు మండలం 3, జీలుగుమిల్లి మండలం 2,వేలేరుపాడు మండలం 01 బుట్టాయిగూడెం మండలం 4 షాపులకు లాటరీ విధానంలో మద్యం దుకాణాలు కేటాయింపు జరిగాయి.

## 18 వరకు వేరుశనగ సాగు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి: మండల వ్యవసాయ అధికారి గీత

రాయల్ జర్నలిజం (రాయచోటి )అక్టోబర్ 14 : రాయచోటి నియోజకవర్గం లోని రైతులు తమ గ్రామాలలో వేరుశనగ పంట అక్టోబర్18 వరకు వేరుశనగ సాగు పంటను కోతను చేపటరాదని సోమవారం చిన్నమండెం వ్యవసాయ అధికారి బి. గీత తెలిపారు వరి సాగు రైతులు తమ పొలాల్లో వరి పంట మడులలో నీరు నిల్వ ఉండకుండా కాలువల ద్వారా మురుగునీరుని బయటకు వెళ్లే లాగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు ఆమె తెలిపారు. తదుపరి 48 గంటల్లో వర్షాలు పశ్చిమ వాయువుదిశగా ఉత్తర తమిళనాడు దక్షిణ కోస్తా తీరాల వైపు ఆంధ్ర లో అక్కడక్కడ బుధ గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని రైతులు ముందుగానే మండల వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నమండెం వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ బ్లెస్సి.అనూష వ్యవసాయ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరు నైపుణ్యం కలిగి ఉండాలి



బాపట్ల,అక్టోబర్ 14 ( రాయల్ జర్నలిజం ) సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరూ నైపుణ్యం కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్సీ అన్నం ప్రతి ప్రభాకర్ అన్నారు. బాపట్ల పట్టణం కాకుమానువారిపాలెంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎలివేట్ ఏఐ స్మార్ట్ ట్యూషన్స్ ను సోమవారం అన్నం సతీష్ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం పై నేటి యువతకు ఎంతో శిక్షణ అవసరమని విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ కల్పించేందుకు బాపట్ల కేంద్రంగా స్టేషన్స్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఐటీ రంగంలో దశాబ్దన్నార కాలం అనుభవం కలిగిన నిపుణుల పర్యవేక్షణలో ఎలివేట్ ఏఐ, కెనడా వారు రూపొందించిన సాఫ్ట్వేర్ ద్వారా విద్యార్థులకు చదువును పర్యవేక్షించి తగిన ప్రణాళికలతో వారిని మెరుగుపరిచేందుకు ఇటువంటి శిక్షణా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానంపై మరింత నైపుణ్యం పెంచుకోవాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎలివెట్ ఏఐ, స్మార్ట్ ట్యూషన్స్ అధినేత దండే యజ్ఞనారాయణ,కాపు సేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు,గోపాలం రఘుపతి, సింగంశెట్టి రమేష్,మానవతా సంస్థ బాపట్ల డైరెక్టర్ వంకాయలపాటి హరిబాబు,లక్కాకుల వెంకటరావు, గణేశుల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయం



రాయల్ జర్నలిజం ఒంటిమిట్ట అక్టోబర్ 14:ప్రభుత్వ ఆధ్వర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా ప్రభుత్వ లాంఛనాలతో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఒంటిమిట్ట , టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బొబ్బిలి రాయుడు అన్నారు. వారు సోమవారం ఒంటిమిట్టలో మాట్లాడుతూ రెండవ అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయమునకు తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తూ ఉంటారని అన్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయము తిరుపతి తిరుమల దేవస్థానం ఆధీనంలోనికి చేరినప్పటి నుండి స్వామి వారి హుండీ ఆదాయము కూడా విపరీతంగా పెరుగుతుందని అన్నారు. ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణ మూర్తులను దర్శించుకోవడానికి మహిళలు ఎక్కువగా వస్తూ ఉంటారని, ఈ నేపథ్యంలో ఒంటిమిట్ట కోదండ రాముని ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరం తరువాత నూతనంగా ఏర్పాటు చేస్తున్న బ్రాందీ షాపులను ఏర్పాటు చేయాలని వారు కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, దేవాదాయశాఖ మంత్రి కి రిప్రజెంటేషన్ పంపించినట్లు వారు తెలిపారు. ఆలయానికి సమీపన పాఠశాలలో, ప్రభుత్వ కళాశాల కూడా ఉందని తెలిపారు. కడప చెన్నై ప్రధాన రహదారిపై కోదండ రామాలయం ఉండడంవల్ల అటు స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులతోనూ, హైవే కావడం వల్ల ప్రయాణించే వాహనాలతోనూ మందుబాబులతో ఆటంకం ఏర్పడే అవకాశం ఉందనిఅన్నారు. అధికారులు స్పందించి కోదండ రామాలయమునకు రెండు కిలో మీటర్ల దూరంలో బ్రాందీ షాపులను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను జయప్రదంగా నిర్వహించాలి



రాయల్ జర్నలిజం (బాపట్ల ) అక్టోబర్ 14 : పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలు జయప్రదంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలపై జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాలలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు విస్తృతమైన ప్రచారం చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో రూ.88 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పంచాయితీ శాఖ ద్వారా కొన్ని పనులు జరుగుతుండగా, మరికొన్ని పనులు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్మశాన వాటికలు, మురికి కాల్వలు, సిసి రోడ్లు, వసతి గ్రహాల, పాఠశాలల ప్రహరీ గోడలు నిర్మిస్తున్నట్లు వివరించారు. ఏయే గ్రామాల్లో ఏ ఏ పనులు చేపట్టారో అనే అంశాలపై ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ప్రచార బోర్డుపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలను ఉంచాలన్నారు. భూమి పూజ చేసిన తదుపరి కార్యక్రమం ఫోటోలను సంబంధిత యాప్ లో నిక్షేత్రం చేయాలన్నారు. 454 గ్రామపంచాయతీలు ఉండగా.. ప్రతి పంచాయతీలో నిర్వహించే కార్యక్రమాలను జియో ట్యాగింగ్ చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాలలో విధిగా ప్రోటోకాల్ పాటించాలన్నారు. వారోత్సవాలు జయప్రదంగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డ్వామా పిడి విజయలక్ష్మి, పీఆర్ ఎస్ఈ హరేరామకృష్ణ, డిపిఓ, తదితరులు పాల్గొన్నారు.

# మరో ప్రయత్నంలో ఆ ఐఏఎస్, ఐపీఎస్‌లు !

అమరావతి :ఏపీ క్యాడర్ కేటాయించినా తెలంగాణలో పని చేస్తున్న ఎనిమిది మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు.. తెలంగాణ కేటాయించిన ఏపీలో పని చేస్తున్న ముగ్గురు ఐఏఎస్‌లు పదహారో తేదీలోపు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాల్సి ఉంది.కానీ వారెవరికి స్థానాలు మారడం ఇష్టం లేదు. అందుకే అత్యున్నత స్థాయిలో తమ ప్రయత్నాలు తాము చేసుకుంటున్నారు. నేరుగా ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి తమను ఉన్న రాష్ట్రాల్లోనే కొనసాగించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ గా కీలక స్థానంలో అమ్రపాలి ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణలో ఉండాలనుకుంటున్నారు. రిటైర్మెంట్ కు దగ్గరగా ఉన్న ఐపీఎస్ అంజనీకుమార్ కూడా అదే ప్రయత్నంలో ఉన్నారు. ఆలాగే కృష్ణజిల్లా కలెక్టర్ సృజన తెలంగాణకు వెళ్లేందుకు ఆసక్తిగా లేరు. అందరూ .. తమ స్థాయిలో గట్టి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. నేరుగా ప్రభుత్వం ద్వారా ప్రయత్నం చేయడానికి సమయం తక్కువగా ఉంది. పదహారో తేదీలోపు ఆయా రాష్ట్రాల్లో రిపోర్టు చేయాల్సి ఉంది. అందుకే న్యాయపో రాటం కూడా చేయాలనుకుంటున్నారు.కానీ సోమేష్ కుమార్ విషయంలో ఇప్పటికే కోర్టు స్పష్టమైన తీర్పు వచ్చింది. మిగిలిన వారికి భిన్నంగా తీర్పులు వచ్చే అవకాశం లేదు. అయితే తమ స్థానికత విషయంలో వారు కొత్త వాదనలు వినిపించే అవకాశం ఉంది. యూపీఎస్సీకి దరఖాస్తు చేసిన సమయంలో నమోదు చేసిన అడ్రస్ ఆధారంగా స్థానికత ఖరారు చేశారని.. కానీ తమ అసలు నేటివ్ తాము ప్రస్తుతం ఉన్న రాష్ట్రాలేనని వారు వాదించే అవకాశం ఉంది. మెత్తంగా ఆ ఐపీఎస్, ఆ ఐఏఎస్‌లకు కదలడం ఇష్టం లేదు. మరి వారి పవర్ పని చేస్తుందా ?

# భాగమతి ఎక్స్‌ప్రెస్‌లో దారుణం మర్చిపోకముందే.. మరో ప్రమాదం..



అమరావతి : దసరా పండుగ వేళ ఈ ఘటన జరగడంతో రైల్వే శాఖ ఉలిక్కిపడింది. ప్రత్యేక రైళ్లు నడుస్తున్న ఆ మార్గంలో.. రాకపోకలను నిలిపి వేయాల్సి వచ్చింది.దేశవ్యాప్తంగా రైలు ప్రమాదాలకు కుట్రలు జరుగుతున్న నేపథ్యంలోనే.. ఈ ప్రమాదం చోటు చేసుకోవడం రైల్వే శాఖను కలవరపాటుకు గురిచేసింది. గత ఆగస్టు నెల నుంచి ఇప్పటివరకు దాదాపు 18 ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలు మొత్తం రైల్వేలో భారీ ప్రమాదాలు చోటు చేసుకునేందుకు దుండగులు చేసిన కుట్రలుగా రైల్వే శాఖ వెల్లడించింది. అయితే ఈ ప్రమాదాలను అత్యంత తెలివిగా నిర్వీర్యం చేసినట్టు రైల్వే శాఖ ప్రకటించింది. అయితే మనదేశంలో అన్ని వర్గాల ప్రజలు రైలులో ప్రయాణించడానికి ఆసక్తి చూపిస్తుంటారు. తక్కువ ధరలు ఉండడంతో సుదూర ప్రాంతాలకు రైళ్ల ద్వారా ప్రయాణిస్తారు. అత్యంత చవకైన రైలు ప్రయాణం ఇప్పుడు ప్రయాణికులను కలవరపాటుకు గురిచేస్తోంది. అక్టోబర్ 12న తమిళనాడు రాష్ట్రంలోని భాగమతి ఎక్స్ ప్రెస్ ఘోర ప్రమాదానికి గురైంది.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మీదుగా దర్భంగా ప్రయాణించాల్సిన భాగమతి ఎక్స్ ప్రెస్(12578) రైలు తమిళనాడులోని కవరై పెట్టై రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలును అత్యంత వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 13 కోచ్ లు చెల్లా చెదురయ్యాయి. పట్టాలు తప్పడంతో రైల్వే శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంపై జాతీయ దర్యాప్తు సంస్థ విచారణ నిర్వహిస్తోంది.

**మధ్యప్రదేశ్లో మరో దారుణం..**

భాగమతి ఎక్స్ ప్రెస్ దారుణాన్ని మర్చిపోకముందే.. మధ్యప్రదేశ్లోని చతర్ పూర్ జిల్లాలో మరో ప్రమాదం జరిగింది. అక్టోబర్ 13 ఆదివారం ఉదయం గీతా జయంతి ఎక్స్ ప్రెస్ రైలు కోచ్ లో ఉదయం మంటలు చెలరేగాయి. కురుక్షేత్ర %-% ఖజురహో ప్రాంతాల మధ్య ఈ ఎక్స్ ప్రెస్ రైలు నడుస్తుంది. ఆదివారం ఈ రైలులో మంటలు చెలరేగాయి. మధ్యప్రదేశ్ లోని చతర్ పూర్ జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో ఈశానగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలు అంతకంతకు విస్తరించడానికి గమనించిన ప్రయాణికులు వెంటనే రైల్వే శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు స్పందించి మంటలను ఆర్పివేశారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. మంటలు వెంటనే అదుపులోకి వచ్చాయి.. మండల వల్ల రైలు దాదాపు గంట ఆలస్యంగా నడుస్తోంది. కోచ్ దిగువన ఉన్న రబ్బరు వేడి ఎక్కడం వల్ల.. నిప్పు రవ్వలు చెలరేగాయి.. అవి మంటలుగా మారాయని తెలుస్తోంది. రైలు క్రమేపి వేగం పుంజుకోవడం వల్ల ఆ మంటలు విస్తరించాయని ప్రయాణికులు చెబుతున్నారు. " మంటలు వ్యాపించిన సమాచారాన్ని ప్రయాణికులు మాకు అందించారు. వెంటనే మేము స్పందించాం. మంటలు అంతకంతకూ విస్తరించకుండా ఆర్పి వేశాం. నష్టం జరగకుండా చూశాం. ప్రమాదానికి కారణం రబ్బరు వేడెక్కడం వల్లే అని మాకు అర్థమైంది. ఇటువంటి ఘటన మరోసారి చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని" స్టేషన్ మాస్టర్ ఆశిష్ యాదవ్ ప్రకటించారు.

# తిరిగొచ్చిన ఒకే ఒక్కడు.. జనసేన పార్టీ మీటింగ్‌లో రాపాక

అమరావతి : ఏపీ రాజకీయాల్లో రసవత్తరమైన సంఘటన చోటు చేసుకుంది. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ ప్రభంజనాన్ని తట్టుకుని జనసేన పార్టీ నుంచి గెలిచిన ఒకే ఒక్క ఎమ్మెల్యేగా రాపాక వరప్రసాద్ అప్పట్లో సంచలనం సృష్టించారు.జనసేన నుంచి ఒకే ఒక్క ఎమ్మెల్యే కావడంతో అధికార పార్టీ వైసీపీతోనే సన్నిహితంగా ఉన్నారు. జనసేనను వీడి వైసీపీలో కూడా చేరారు. ఇప్పుడు ఇన్ని రోజుల తర్వాత రాపాక మళ్లీ జనసేన నిర్వహించిన ఓ సమావేశంలో కనిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.కోనసీమ జిల్లా మలికిపురంలో కూటమి పార్టీలు నిర్వహించిన క్రియాశీలక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాజోలు జనసేన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. ఇదే సమావేశానికి రాజోలు మాజీ ఎమ్మెల్యే అయిన రాపాక హాజరయ్యారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను రాపాక కలవడం ఇది రెండోసారి. దీంతో రాజోలు నియోజకవర్గంలో దీనిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.త్వరలోనే వైసీపీకి రాజీనామా చేస్తానని రాపాక వరప్రసాద్ ప్రకటించారు. ఇదే విషయాన్ని పార్టీ పెద్దలకు తెలియజేశానని తెలిపారు. అనివార్య కారణాల వల్ల జనసేన నుంచి వైసీపీలోకి వెళ్లాల్సి వచ్చిందని వివరించారు. వైసీపీలో చేరిన తర్వాత పార్టీ అధిష్ఠానం ఆదేశాలను పాటించానని చెప్పారు. కానీ 2024 ఎన్నికల్లో తనను కాదని రాజోలు నుంచి గొల్లపల్లి సూర్యారావుకు టికెట్ ఇచ్చారని తెలిపారు. ఇష్టం లేకపోయినా తనను అమలాపురం



నుంచి ఎంపీగా పోటీచేయించారని పేర్కొన్నారు. ఏ పార్టీలో చేరేది తొందరలోనే చెబుతానని స్పష్టం చేశారు.2019 ఎన్నికల్లో రాజోలు నుంచి జనసేన తరఫున గెలిచిన రాపాక అప్పుడు వైసీపీతో కలిసిపోయారు. 2024 వైసీపీ నుంచి అసెంబ్లీ టికెట్ ఆశించారు. కానీ గొల్లపల్లి సూర్యారావుకు వైసీపీ టికెట్ ఇచ్చింది. అలాగే అమలాపురం నుంచి రాపాకకు ఎంపీ టికెట్ ఇచ్చారు. కానీ అమలాపురంలో రాపాకకు అంతగా పట్టులేకపోవడంతో అందులో ఘోర పరాభవం చెందారు. దీంతో ఎన్నికల తర్వాత రాపాక టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కూటమి పార్టీలు నిర్వహించిన సమావేశంలో పాల్గొనడం గమనార్హం.

# కవరైపెట్టై రైలు ప్రమాదంలో కుట్ర కోణం?



చెన్నై: తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కవరైపెట్టై రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రైలు ప్రమాదంపై భిన్న కోణాల్లో విచారణ మొదలైంది. సాంకేతిక లోపమా? సిగ్నలింగ్ వైఫల్యమా? కుట్ర కోణమా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా.. అన్నది తేల్చేందుకు ఎన్ఐఏ, రైల్వే భద్రతా విభాగాలు విచారణ చేపట్టాయి. కర్ణాటకలోని మైసూరు నుంచి బిహార్‌లోని దర్భంగాకు బయల్దేరిన భాగమతి ఎక్స్‌ప్రెస్ (12578) కవరైపెట్టై సమీపంలో ప్రధాన లైన్‌లో కాకుండా, లూప్‌లైన్‌లోకి వెళ్లి గూడ్స్‌రైలును ఢీకొన్న ఈ దుర్ఘటనలో ప్రాణనష్టం జరగకపోయినా, పలువురు గాయపడ్డారు. 12 బోగీలు గాల్లోకి లేచి చెల్లాచెదురుగా పడ్డాయి. విచారణ నిమిత్తం రంగంలోకి దిగిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు శని, ఆదివారాల్లో ఘటనాస్థలిని పరిశీలించారు. జాగిలాలను రప్పించి, ఆధారాలు సేకరించారు. గతేడాది ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన ప్రమాదం కూడా ఇదే తరహాలోనే ఉండటంతో తాజా దుర్ఘటన వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందా అన్న కోణంలో కూపీ లాగుతున్నారు. రైల్వేస్టేషన్‌లో రికార్డయిన డేటా లాగర్‌ను తీసుకొని, ప్రమాదానికి ముందు, తర్వాత ఏం జరిగిందో పరిశీలించారు. ప్రమాదానికి 7 నిమిషాల ముందు పొన్నేరి నుంచి కవరైపెట్టై స్టేషన్ మీదుగా గుమ్మిడిపూండి వైపు ఓ రైలు వెళ్లింది. అది ఎక్కడా లూప్‌లైన్‌లోకి వెళ్లలేదు. తర్వాత వచ్చిన భాగమతి ఎక్స్‌ప్రెస్ మాత్రం ప్రధాన లైనులో గ్రీన్ సిగ్నల్ ఉన్నా, లూప్‌లైన్‌లోకి వెళ్లి, గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ 7 నిమిషాల్లో లోపం ఎక్కడ జరిగిందో తేల్చే పనిలో ఎన్ఐఏ నిమగ్నమైంది.

**ట్యాంపరింగ్ జరిగిందా?**

కవరైపెట్టై స్టేషన్‌మాస్టర్ మునిప్రసాద్‌బాబు ఫిర్యాదు మేరకు రైల్వే అధికారులు రంగంలోకి దిగారు. రైలు ట్రాక్ మారడానికి వాడే సిగ్నలింగ్ గేర్, స్విచ్ పాయింట్ను ట్యాంపర్ చేసినట్లు వారు అనుమానించినట్లు తెలుస్తోంది. ఇక్కడికి సమీపంలోని పొన్నేరి రైల్వేస్టేషన్‌లో ఇటీవలే పట్టాల ఇంటర్ లాకింగ్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేసినట్లు బయటపడటం ఇందుకు బలాన్నిస్తోంది. బెంగళూరు నుంచి వచ్చిన దక్షిణ సర్కిల్ పరిధి రైల్వే భద్రతా కమిషనర్ ఏ.ఎం.చౌదరి బృందం లోతుగా తనిఖీ చేసింది. ఆర్పీఎఫ్ సైతం విచారణ చేపట్టింది. ఘటనా స్థలంలో పట్టాలకు సంబంధించిన బోల్టులు, నట్లు కొన్ని మాయమైనట్లు గుర్తించారు.

# దసరా ముగించుకొని నగరానికి.. పంతంగి టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ..

అమరావతి : దసరా పండుగకు వెళ్లిన నగరవాసులు స్వగ్రామాల నుంచి తిరిగి నగరం బాట పట్టారు. దీంతో ఆదివారం సాయంత్రం నుంచి రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.సోమవారం నుంచి కార్యాలయాలు తెరుచుకోవడంతో చాలా మంది ఆదివారం నగరానికి చేరుకుంటున్నారు. దీంతో వివిధ టోల్ ప్లాజాల వద్ద వందలాది వాహనాలు బారులు తీరాయి. పలు అదనపు కౌంటర్ల ద్వారా పంపినప్పటికీ వాహనాల రాకపోకలు విపరీతంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. 65వ నెంబరు జాతీయ రహదారిపై ఉదయం నుంచి ట్రాఫిక్ పెరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, నల్గొండ జిల్లా కేతేపల్లి టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంతంగి టోల్‌గేట్ వద్ద 16 గేట్లకు గాను 10 గేట్ల ద్వారా వాహనాలను హైదరాబాద్ వైపు పంపించారు. సాధారణ రోజుల్లో 30 వేల నుంచి 35 వేల వాహనాలు తిరుగుతున్నాయని, దసరా పండుగ సందర్భంగా 50 వేలకు పైగా వాహనాలు తిరుగుతున్నాయని టోల్ గేట్ నిర్వాహకులు తెలిపారు.బీబీనగర్ మండలం గూడూరు టోల్ ప్లాజా వద్ద కిలోమీటరుకు పైగా వాహనాలు బారులు తీరాయి. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద వాహనాల సంఖ్యకు అనుగుణంగా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడంతో కిలోమీటరు మేర వాహనాలు నాలుగు లైన్లతో బారులు తీరాయి. ఆదివారం 35 వేల నుంచి 40 వేల వాహనాలు ప్రయాణించాయని సిబ్బంది తెలిపారు. మరోవైపు ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై టోల్ గేట్ వద్ద ఆదివారం కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ టోల్ ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం సుమారు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అయితే సాయంత్రానికి తెలంగాణ జిల్లాల నుంచి బయలుదేరిన నగరవాసులు అర్ధరాత్రి దాటిన తర్వాత ఇళ్లకు చేరుకోవడం కనిపించింది.

# కొత్త ప్రదేశానికి వెళ్తున్నారా.? మీ ఫోన్‌లో ఈ యాప్ ఉండాల్సిందే



అమరావతి : ప్రస్తుతం ఏ చిన్న పనికైనా చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండే పరిస్థితి వచ్చేసింది. అన్ని రకాల అవసరాలకు యాప్స్ అందుబాటులోకి వచ్చేశాయి. ఇక ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లిన సమయంలో సమాచారం కోసం కూడా యాప్స్ అందుబాటులో ఉన్నాయి.అయితే రూట్ మ్యాప్, ఫాస్టగ్ రీఛార్జ్ ఇలా రకరకాల అవసరాలకు ఒక్కో యాప్ ఉపయోగించాల్సి ఉంటుంది. కానీ అవసరాలకు ఒకే యాప్ అందుబాటులో ఉంది అదే 'రాజ్‌మార్గ్‌యాత్ర'. ఈ యాప్ సహాయంతో అన్ని రకాల సేవలు ఒకే చోట పొందొచ్చు. ఈ యాప్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.ముఖ్యంగా నేషనల్ హైవేస్‌పై వెళ్లే సమయంలో అవసరమయ్యే అన్ని సమాచారాలను ఈ యాప్ అందిస్తోంది. రెస్టారెంట్స్, పెట్రోల్ పంపులు, ఛార్జింగ్ స్టేషన్లు, హాస్పిటల్స్, ఏటీఎంలు, పోలీస్ స్టేషన్లు, పర్యటక ప్రదేశాల గురించి.. ఇలా అన్ని వివరాలను ఈ యాప్ అందిస్తుంది. రోడ్లకు సంబంధించి ఏవైనా సమస్యలున్నా ఈ యాప్‌లోనే ఫిర్యాదు చేసుకోవచ్చు. 'రిపోర్ట్ అన్ ఇష్యూ ఆన్ ఎన్‌హెచ్' ఆప్షన్ సహాయంతో ఫిర్యాదు చేయొచ్చు.ఇక ఈ యాప్‌లోనే ఫాస్టాగ్‌కు సంబంధించిన సేవలు కూడా పొందొచ్చు. కొత్త ఫాస్టగ్‌తో పాటు, నెలవారీ పాస్‌లు పొందొచ్చు. ఇక జాతీయ రహదారులపై మీరు వెళ్తున్న మార్గంలో ఎక్కడెక్కట టోల్ ప్లాజాలు ఉన్నాయి, ఎంత ఖర్చు అవుతుందన్న విషయాలు ముందే తెలుసుకోవచ్చు. 'Toll Plaza Enroute' అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి మీరు బయల్దేరుతున్న ప్రాంతం, చేరాల్సిన గమ్యస్థానాన్ని ఎంటర్ చేసి సెర్చ్‌పై క్లిక్ చేస్తే మీకు కావాల్సిన టోల్? ప్లాజా వివరాలన్నీ అందులో కన్పిస్తాయి.మీ వాహనవేగాన్ని అంచనా వేస్తూ, అలర్ట్ చేసే ఫీచర్ కూడా ఇందులో అందుబాటులో ఉంది. ఓవర్ స్పీడ్ నోటిఫికేషన్ ద్వారా మిమ్మల్ని అలర్ట్ చేస్తుంది. ఇక వాహనదారుల కోసం హైవే అసిస్టెన్స్, పోలీస్ అసిస్టెన్స్, ఎమర్జెన్సీ నంబర్లు ఎమర్జెన్సీ ఆప్షన్‌లో కన్పిస్తాయి. మీరు ప్రయాణిస్తున్న హైవే వివరాలు కూడా అందులో డిస్?ప్లే అవుతాయి. కావాలంటే మీ జర్నీని రికార్డ్ చేసుకోచ్చు. ఈ యాప్ ఇంగ్లిష్, తెలుగుతో పాటు మరో 12 భాషలకు సపోర్ట్ చేస్తుంది. ఆండ్రాయిడ్‌తోపాటు, యాపిల్ యూజర్లకు సైతం ఈ యాప్ అందుబాటులో ఉంది.

# శబరిమల అయ్యప్ప భక్తుల దర్శనాలపై మూడు కీలక నిర్ణయాలు

అమరావతి : ఈసారి కేరళలో శబరిమల అయ్యప్ప స్వామి మండల పూజా మహోత్సవాలు నవంబరు 15 నుంచి డిసెంబరు 26 వరకు జరగనున్నాయి. ఈతరుణంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) భక్తుల దర్శనానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.గతేడాది ఎదురైన చేదు అనుభవాల నేపథ్యంలో ఈసారి అయ్యప్ప భక్తులకు స్పాట్ బుకింగ్స్ ఉండవని వెల్లడించింది. గతేడాది స్పాట్ బుకింగ్స్, ఆన్ లైన్ బుకింగ్స్ రెండింటినీ అనుమతించారు. దీంతో ప్రతిరోజూ సగటున లక్షన్నర మందికిపైగా భక్తులు శబరిమలకు వచ్చారు. అయితే వారందరికీ సరిపోయే రీతిలో క్యూ లైన్లను కానీ, దర్శనం కౌంటర్లను కానీ, రవాణా ఏర్పాట్లను కానీ చేయలేదు. ఫలితంగా వారిలో దాదాపు 80వేల నుంచి 90 వేలమందికి దర్శన అవకాశం దొరికే సరికే దాదాపు 20 గంటల టైం పట్టింది. దీంతో ఎంతోమంది భక్తులు అప్పట్లో శబరిమలకు వచ్చినా.. అయ్యప్ప స్వామివారి దర్శనాన్ని చేసుకోలేకపోయారు. మళ్లీ ఆ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఇప్పుడు స్పాట్ బుకింగ్స్‌ను ఆపేశామని శబరిమల ఆలయ బోర్డు వర్గాలు తెలిపాయి.ఆన్‌లైన్ బుకింగ్స్ చేసుకునే వారికి దాదాపు 48 గంటల గ్రేస్ టైంను కేటాయిస్తారని సమాచారం. అంటే శబరిమల అయ్యప్ప దర్శనానికి ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకున్న సమయంపై అదనంగా 48 గంటల టైం కూడా భక్తులకు కేటాయిస్తారన్న మాట. ఒకవేళ ఆలస్యంగా శబరిమలకు చేరుకున్నా.. గ్రేస్ టైంను వాడుకొని దర్శనం చేసుకొని వెళ్లొచ్చు.అయ్యప్ప భక్తులు గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే.. శబరిమల ఆలయ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దర్శన టికెట్లు, ప్రసాదాలను ఆన్‌లైన్లో బుక్ చేసుకోవాలి. రోజుకు 80



వేల మంది భక్తులను అయ్యప్ప దర్శనానికి అనుమతించనున్నారు. అయ్యప్ప భక్తులకు దర్శన సమయాన్ని కూడా పొడిగించారు. శబరిమల అయ్యప్ప సన్నిధానంలో దర్శన వేళలు వేకువజామున 3 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కొనసాగుతాయి.ఈ మార్పు వల్ల అయ్యప్ప దర్శనాలకు రోజూ 17 గంటల పాటు సమయం లభిస్తుంది.డిసెంబరు 26న అయ్యప్ప స్వామి మండల పూజా మహోత్సవాలు ముగుస్తాయి. ఆ తర్వాత రెండు రోజుల పాటు ఆలయాన్ని మూసివేస్తారు. మళ్లీ డిసెంబరు 30 నుంచి మకరు విళక్కు పూజల కోసం ఆలయాన్ని తెరిచి ఉంచుతారు. జనవరి 14న మకర సంక్రాంతి సందర్భంగా మకర జ్యోతి (మకర విళక్కు) దర్శనం ఉంటుంది. జనవరి 20న అయ్యప్ప పడిపూజతో మకరు విళక్కు సీజన్ ముగుస్తుంది.

# ఏపీలో భారీ వర్షాలు.. ఆ జిల్లాల్లో సెలవు ప్రకటన..



అమరావతి : ఆగ్నేయ బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం మీదుగా ఏర్పడిన ఆవర్తనం పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి ఆగ్నేయ బంగాళాఖాతం మీద ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.దీని ప్రభావంతో నేడు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. మరో 48 గంటల్లో బలపడి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాల వైపు కదిలే అవకాశం ఉందని అంచనా వేసింది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు అధికారులు. భారీవర్షాలు కురవనుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని హెచ్చరించింది. మరోవైపు ఇవాళ.. బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, వైఎస్ఆర్ జిల్లా, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, పల్నాడు జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. భారీ వర్షాల సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని.. వాగులు, వంకలకు సమీపంలోకి వెళ్లవద్దని సూచించారు. అలాగే విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. తెలంగాణలో రాబోయే మూడురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.భారీ వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటించారు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్.. మరోవైపు.. చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు, కాలేజీలకు, అంగన్ వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్.. అయితే, రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.. మరోవైపు.. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి..

# Why BJP's master strategist has been made an observer in Haryana



The BJP has appointed Union Home and Cooperation Minister Amit Shah and Madhya Pradesh Chief Minister Mohan Yadav as observers of the Parliamentary Board as part of the government formation in Haryana.Both Shah and Yadav will be responsible for choosing the leader of the legislative party in the state which saw the return of BJP government for the third consecutive time in results declared on October 8.The swearing-in ceremony of the new CM of Haryana will be held in Panchkula on October 17 and before that, a meeting of the legislature party has been called in Chandigarh on October 16 in which both the observers will be present.

Why Amit Shah?

It may be noted that the BJP high command has appointed Amit Shah as the observer for the first time after 2022 to elect the leader of the legislative party in a state. In March 2022, Shah went to UP as an observer. Although the BJP had made acting Chief Minister Nayab Saini the CM face in the Haryana elections, now discussions are going on that all is not well within the Haryana BJP.Political observers feel that if Union Home Minister Amit Shah, who is the master strategist of the party is made the observer of Haryana to choose the leader of the legislative party, then it means there are more than one contender to the CM post. The reason behind Shah's entry is believed to be the claim of former Home Minister Anil Vij and Union Minister of State Rao Indrajit Singh for the post of Chief Minister. The party high command feels that the MLAs supporting Vij and Indrajit can play some game in the BJP Legislative Party meeting, which only Shah will be able to control.It is worth mentioning here that when Naib Singh Saini's name came up as the leader of the legislative party in March 2024, after ML Khattar's resignation, former minister Anil Vij got angry and so much was he miffed at this that he left the meeting in front of the observers.Now to avoid a similar situation, and to tame any kind of dissent the party's top brass is sending Amit Shah so as to avoid any controversy and Naib Saini's name is easily approved. It may be recalled that Amit Shah had announced to make Saini the next Chief Minister in a rally in Panchkula before the elections.

The Anil Vij factor

There was no controversy or doubt in the party about Saini becoming the CM however, when former Home Minister Anil Vij, who was elected MLA for the seventh time from Ambala Cantonment, staked his claim for the CM post thereby creating a new crisis for the party. Initially, Vij's claim was seen as a strategy to win the election, but even after winning the election, when Vij claimed the post of Chief Minister, the party did not take this claim lightly.The BJP has got 48 seats in this election, which is two more than the majority while three independent MLAs have also supported BJP, due to which it now has 51 MLAs.

Rao Indrajit also in line

Another problem for the party is being posed by Union Minister of State Rao Indrajit, who has been eyeing the post of Chief Minister for a long time and it is feared that both Vij and Rao could create some trouble during the meeting.Rao Indrajit is a big name of the BJP in Ahirwal and of his eight candidates all have become MLAs thus increasing his stature. Now the party fears that Rao could demand his pound of flesh and it is no secret that he has been eyeing the CM post for a long time.Amid this tussle, the party believes that no one will be able to raise their voice against the CM choice if Amit Shah is present therefore, Shah has been sent to Haryana as a part of the strategy to suppress any kind of controversy before it arises, so that Naib Saini is elected as the leader of the BJP Legislative Party without any opposition and comfortably take oath as the CM of the state in the presence of the Prime Minister on October 17.

# Small vehicles get exemption at Mumbai toll plazas

TheMaharashtra governmenton Monday announced a complete toll waiver for light motor vehicles at all five entry points into Mumbai, effective from midnight tonight. The decision of exempting small vehicles of toll charges at Mumbai toll plazas was made during today's State Cabinet meeting.The toll plazas are Vashi on the Sion-Panvel Highway, Mulund on Lal Bahadur Shastri Marg and Eastern Express Highway, Airoli Bridge on Airoli-Mulund Road, and Dahisar on the Western Express Highway. Maharashtra Chief MinisterEknath Shindeannounced the decision of exempting small vehicles of toll charges at Mumbai toll plazas during the state cabinet meeting in Mumbai.Following the Cabinet meeting, Maharashtra minister Dada Bhuse said, "There are five toll plazas at Mumbai's entry points, including Dahisar, Anand Nagar, Vashi, Airoli, and Mulund. Tolls of Rs 45 and Rs 75 were being collected at these plazas, with the toll system set to remain in effect until 2026. Approximately 3.5 lakh vehicles commute through these tolls daily, of which 70,000 are heavy vehicles and 2.80 lakh are light vehicles. Today, the government has decided to exempt light vehicles from paying tolls starting after midnight. This will also save the time spent waiting in queues. The government had been discussing this matter for several months, and today, this significant decision has been made."After the announcement of the toll waiver, Shiv Sena (UBT) MP Priyanka Chaturvedi criticised the state government, suggesting the decision was a last effort to avoid an impending defeat."Desperate measure just hours before election code of conduct shows that Mahajhoothi government knows their days are numbered so try and salvage whatever little they can to save themselves from the public's wrath. Also because it has been under severe fire for the absolute and total collapse of law and order. Just like Ladki behen came at the back of a defeat, this toll decision comes at the back of an impending defeat," she said in a post on X.Meanwhile, Maharashtra Navnirman Sena (MNS) chiefRaj Thackeray said, "Light vehicles will be exempt from tolls at all five toll booths entering Mumbai starting midnight. Congratulations to all the citizens of the MMR area, and a big salute to my Maharashtra Sainiks. My Sainiks fought relentlessly for transparency in toll collections, demanding that roads funded through tolls should be toll-free. We faced criticism for vandalising toll booths, but often, extreme steps are the only way to make the government take notice. That said, it`s a moment of happiness for



Mumbaikars who are finally toll-free, and our movement has seen success. I congratulate the state government, but they must assure the people that this isn`t just an election-driven decision. ""Mumbai may be toll-free today, but countless people have suffered in this toll system over the years. A fair investigation is necessary, but there`s little certainty it will happen, given the complexities of who holds whom accountable. Still, it`s a relief that Mumbaikars are freed from this burden. To my Maharashtra Sainiks—if anyone ever asks about the outcome of the toll agitation, proudly point to this victory of making Mumbai toll-free. Once again, congratulations to everyone," he added. TheMaharashtra cabinetalso expressed shock over the killing of former state minister Baba Siddique and adopted a condolence resolution to this effect.

# Who Is Handler of Baba Siddique's Killers? New Jalandhar Link Surfaces

Mumbai: In a major development in Nationalist Congress Party (NCP) leader Baba Siddique's murder probe, the Mumbai Crime Branch have identified the fourth accused suspected to be involved in the killing.The suspect, Mohammad Zeeshan Akhtar, is believed to have directed the shooters from outside. Akhtar provided them with information about Siddique's location at the time of the shooting, and he also assisted with logistical support, including arranging rental rooms, said police sources. Former Maharashtra Minister Baba Siddique was shot dead in Mumbai on Saturday. Three attackers fired shots at him outside his son Zeeshan's office in Bandra East. The 66-year-old was rushed to Lilavati Hospital where he succumbed to injuries. Siddique was cremated with full state honors at Bada Qabrastan on Sunday. Lawrence Bishnoi gang on Sunday claimed responsibility for the killing of Siddique, a day after the former minister was gunned down. Shubham Lonkar, an associate of the Lawrence Bishnoi gang, publicly claimed responsibility for the attack on Siddique in a social media post.Mumbai police had arrested Gurmail Baljit Singh (23), a resident of Haryana and Dharmaraj Rajesh Kashyap (19), from Uttar Pradesh, whereas there one aide, who was at the spot during the firing, fled from the spot. The accused were produced before the court by the crime branch



team, where Dharmaraj Kashyap's lawyer claimed that he was a minor. However, an ossification test of accused Dharmaraj Kashyap in which it was proved that he is not minor. Akhtar was a resident of village Shakar of Nakodar in Jalandhar. He was arrested by the local police in 2022 in a case related to organized crime, murder and robbery. While he was lodged in Patiala jail, he came in contact with the Lawrence Bishnoi gang and received instructions to murder Siddique, revealed sources. As he was released from jail on June 7 of this year, he subsequently became involved with the gang and moved to Mumbai.As investigation widens, the Police on Sunday arrested 28-year-old Pravin Lonkar from Pune. He is brother of Shubham Lonkar, accused in the Nirmal Nagar firing case. The brothers had hatched the conspiracy of killing Siddiqui and enlisted Kashyap and Shivkumar Gautam in the plot, an official said."Yesterday, between 9-9.30 pm, ex-state minister Baba Siddique was shot outside his sons' office, under Nirmal Nagar police station. An offence has been registered and the investigation has been handed over to the Crime Branch. Two accused were detained on the spot... Two pistols and 28 rounds have been recovered... We have the custody of the accused till October 21. We are investigating the Lawrence Bishnoi gang's role in the case," DCP Crime Branch Datta Nalawade said."Mumbai Crime Branch recovered two pistols from both the accused. The accused had brought pepper spray, first, the accused were about to spray and then they were about to fire but the third accused Shiv Kumar Gautam started firing directly. Three constables were with Baba Siddique and at the time of the incident also three constables were there but they could not do anything. One more person has been injured in this firing," he added.The Mumbai Crime Branch has registered a case at Nirmal Nagar Police Station in connection with the murder under relevant sections of the Bharatiya Nyaya Sanhita, Arms Act and Maharashtra Police Act.The case has been registered at Nirmal Nagar Police Station under Crime Registration No. 589/2024, Sections 103(1), 109, 125, and 3(5) of the Bharatiya Nyaya Sanhita (BNS), along with Sections 3, 25, 5, and 27 of the Arms Act, and Section 37 and section 137 of the Maharashtra Police Act.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

రాయల్ స్పోర్ట్స్




రాయల్ సినిమా

## ఆసీస్ ఒకరిద్దరిపై ఆధారపడదు.. మరో మ్యాచ్ ఆడే ఛాన్స్ వస్తే గొప్పగా భావిస్తాం: హర్మన్



చివరివరకూ క్రీజ్‌లో ఉన్నా తన జట్టును ఓటమి నుంచి మాత్రం గట్టెక్కించడంలో కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ విఫలమైంది. హాఫ్ సెంచరీ చేసి కీలక ఇన్నింగ్స్ ఆడినా ఆసీస్ చేతిలో మాత్రం పరాజయం తప్పించలేకపోయింది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో కీలకమైన పోరులో భారత్ ఓడిపోయి సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. అయితే, ఇరు జట్ల మధ్య ఉన్న వ్యత్యాసం ఏంటో హర్మన్ వెల్లడించింది. న్యూజిలాండ్ – పాకిస్థాన్ మ్యాచ్ ఫలితం గురించీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. "కీలకమైన మ్యాచ్‌లో ఓడిపోవడం నిరాశకు గురిచేసింది. నాతోపాటు దీప్తి శర్మ క్రీజ్‌లో ఉన్నంతవరకూ మేం గెలుస్తామని భావించాం. చివరి ఓవర్‌లో ఆసీస్ అద్భుతంగా బౌలింగ్ చేసింది. మమ్మల్ని పరుగులు చేయనీకుండా అడ్డుకోగలిగింది. ఆస్ట్రేలియాకు, ఇతర జట్లకు ఉన్న వ్యత్యాసం అదే. కీలకమైన సమయంలో వారు దూకుడుగా ఆడతారు. కేవలం ఒకరిద్దరిపైనే ఆధారపడకుండా జట్టుగా సమష్టిగా రాణిస్తారు. అక్కడ చాలామంది ఆల్‌రౌండర్లు ఉన్నారు. మేం కూడా సరైన ప్రణాళికలతోనే బరిలోకి దిగాం. కానీ, వారు సులువుగా పరుగులు ఇవ్వలేదు. అనుభవపరంగానూ మాకంటే ఆసీస్ జట్టే మెరుగైంది. జట్టులోని పదకొండు మంది కలసికట్టుగా ఆడితేనే విజయాలు వస్తాయి. గాయాలు అవుతుంటాయి. వాటన్నింటినీ తట్టుకొని ముందుకుసాగాలి. ఆసీస్ నిర్దేశించిన టార్గెట్‌ను ఛేదించదగ్గదే. అయితే, మిడిల్ ఓవర్లలో బౌండరీలను రాబట్టలేకపోయాం. కొన్ని లూజ్ బాల్స్ పడినా కొట్టలేకపోయాం. ఈవిషయంలో ఆసీస్ నుంచి చాలా నేర్చుకోవాలి. విజయం కోసం మేం చాలా శ్రమించాం. ఇక మేం సెమీస్‌కు చేరుకుంటామా? లేదా? అనేది మా చేతుల్లో లేదు. ఒకవేళ మాకు మరో మ్యాచ్ ఆడే అవకాశం వస్తే గొప్పగా భావిస్తాం. అయితే, ఎవరు ముందుకువెళ్తారనేది వేచి చూడాలి. ఎవరికైతే అర్హత ఉంటుందో ఆ జట్టే అక్కడ ఉంటుందని భావిస్తున్నా" అని హర్మన్ వెల్లడించింది. టీ20 ప్రపంచకప్ టోర్నీల్లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్ల జాబితాలో మిథాలీ రాజ్‌తో (726) కలిసి హర్మన్ సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచింది. వరుసగా రెండు మ్యాచుల్లో హాఫ్ సెంచరీలను హర్మన్ సాధించింది.

**హర్మన్ చివరి ఓవర్ ఆటతీరుపై ట్రోలింగ్**

చివరి ఓవర్‌లో 14 పరుగులు చేయాల్సిన తరుణంలో అప్పటికే క్రీజ్‌లో హాఫ్ సెంచరీతో ఉన్న హర్మన్ ఎక్కువ స్ట్రైకింగ్ తీసుకోకపోవడంపై నెట్టింట ట్రోలింగ్ మొదలైంది. మొదటి బంతిని సింగిల్ తీసి నాన్‌స్ట్రైకర్‌గా వచ్చిన హర్మన్.. మూడు బంతుల్లో 13 పరుగులు చేయాల్సినప్పుడు కూడా సింగిల్‌తోనే సరిపెట్టుకుంది. కనీసం సిక్స్‌ల కోసం ప్రయత్నిస్తే సూపర్ ఓవర్ వరకైనా మ్యాచ్ సాగే అవకాశం ఉండేదని పలువురు అభిప్రాయపడ్డారు. హర్మన్ ఎందుకు ఇలా ఆడిందో అర్థం కావడంలేదంటూ కామెంట్లు పెట్టారు.

## ఆస్ట్రేలియాకు భారీ షాక్.. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీకి స్టార్ ఆల్‌రౌండర్ దూరం



గత కొన్ని రోజులుగా అనుకున్నట్లుగానే ఆస్ట్రేలియా కీలక ప్లేయర్ భారత్‌తో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో ఆసీస్ స్వదేశంలో ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. నవంబర్ మూడో వారం నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది. దాదాపు 30 ఏళ్ల తర్వాత ఇరు జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్ జరగబోతోంది. ఇలాంటి సమయంలో ఆస్ట్రేలియాకు షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ ఆడటం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. వెన్ను నొప్పి కోసం శస్త్రచికిత్స చేయించుకొనేందుకు గ్రీన్ సిద్ధమైనట్లు పేర్కొంది. అతడు పూర్తిగా కోలుకోవడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. మరో వారం రోజుల్లో శస్త్రచికిత్స చేయించుకుంటాడని క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ సందర్భంగా వెన్ను నొప్పితో అర్ధంతరంగా స్వదేశానికి తిరిగొచ్చాడు. "పేస్ బౌలర్లకు వెన్నెముకలో పగుళ్లు అసాధారణం కానప్పటికీ.. కామెరూన్ గ్రీన్ విషయంలో మరింత గాయం కావడానికి మాత్రం అదే కారణం. వైద్య నిపుణులు నిశితంగా పరిశీలించాక గ్రీన్‌కు శస్త్రచికిత్స అవసరమని తేల్చారు. సర్జరీ చేస్తేనే ప్రయోజనం ఉంటుందని వారి భావన. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను అడ్డుకోవాలంటే శస్త్రచికిత్సకు వెళ్లడమే మంచిది. అయితే, అతడు కోలుకోవడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. దానిని దృష్టిలో ఉంచుకొని విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించాం" అని క్రికెట్ ఆస్ట్రేలియా పోస్టు పెట్టింది. కామెరూన్ గ్రీన్ స్థానంలో కొత్త ఆటగాడికి అవకాశం ఇస్తారని తెలుస్తోంది. పేస్‌కు అనుకూలంగా ఉండే ఆసీస్ పిచ్‌లపై ఆల్‌రౌండర్ గ్రీన్ లేకపోవడం ఆ జట్టుకు నష్టమేనని క్రికెట్ వర్గాలు అంటున్నాయి. దాదాపు నెలన్నర రోజులపాటు కొనసాగే ఆస్ట్రేలియా పర్యటన భారత్‌కు వెళ్లనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ మూడో సీజన్ ఫైనల్ రేసులో తొలి రెండు స్థానాల్లో ఉన్న ఈ రెండు జట్ల మధ్య సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు తమ స్క్వాడ్‌లను భారత్, ఆస్ట్రేలియా ప్రకటించలేదు.

షెడ్యూల్ ఇదే..

తొలి టెస్టు: నవబంబర్ 22 నుంచి నవంబర్ 26 వరకు (పెర్త్)
రెండో టెస్టు: డిసెంబర్ 6 నుంచి డిసెంబర్ 10 వరకు (అడిలైడ్)
మూడో టెస్టు: డిసెంబర్ 14 నుంచి డిసెంబర్ 18 వరకు (బ్రిస్బేన్)
నాలుగో టెస్టు: డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 30 వరకు (మెల్‌బోర్న్)
ఐదో టెస్టు: 2025 జనవరి 3 నుంచి 2025 జనవరి 7 వరకు (సిడ్నీ)

## ఆరేళ్లు.. నలుగురు స్టార్లు.. నీల్ లైనప్ వేరే లెవెల్!



కోలీవుడ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ పేరు కేజీఎఫ్ మూవీ టైమ్ లో మోత మోగిన విషయం తెలిసిందే. స్టార్ హీరో యష్ నటించిన కేజీఎఫ్ సిరీస్ రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వేరే లెవెల్ లో అలరించాయి. బ్లాక్ బస్టర్ హిట్స్ గా నిలిచాయి. కేజీఎఫ్–2 అయితే ఏకంగా బాక్సాఫీస్ ను షేక్ చేసింది. రూ.1200 కోట్లకు పైగా వసూలు చేసింది. దీంతో ప్రశాంత్ నీల్.. నేషనల్ వైడ్ గా క్రేజ్ సంపాదించుకున్నారు. పాన్ ఇండియా లెవెల్ లో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ తర్వాత పాన్ ఇండియా స్టార్ ప్రభాస్.. సలార్ మూవీతో మరో బ్లాక్ బస్టర్ హిట్ ను అందుకున్నారు ప్రశాంత్ నీల్. సినిమాలో ఆయన ఇచ్చిన ఎలివేషన్లు ఓ రేంజ్ లో అందరినీ అలరించాయి. రిపీట్ మోడ్ లో సినిమా చూసి మరీ ప్రభాస్ ఫ్యాన్స్ ఎంజాయ్ చేశారు. అయితే ఇప్పుడు నీల్ లైనప్ చూస్తే షాక్ అవ్వాల్సిందే. మరో ఐదారేళ్లపాటు స్టార్ హీరోలతో సినిమాలు చేయనున్నారు. అందుకు గాను ఇప్పటికే ఆయన లాక్ చేసుకున్నారు. మరి నీల్ లైనప్ లో సినిమాలు ఏంటంటే? ప్రస్తుతం మ్యాన్ ఆఫ్ ది మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ తో చేయాల్సిన సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు నీల్. కొన్ని రోజుల క్రితం షూటింగ్ స్టార్ట్ అవుతుందని వార్తలు రాగా.. ఇంకా మొదలు కాలేదు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేసి.. 2026 సంక్రాంతికి రిలీజ్ చేయాలని టార్గెట్ తో ఉన్నారు నీల్. ఆ తర్వాత సలార్ సీక్వెల్ శౌర్యాంగ పర్వం కంప్లీట్ చేయనున్నారు. చిత్రీకరణకు ముందే భారీ అంచనాలు నెలకొల్పిన సలార్–2.. 2027 సమ్మర్ లో రానుందని టాక్. కేజీఎఫ్ సిరీస్ చిత్రాలతో ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చిన ప్రశాంత్ నీల్.. కేజీఎఫ్–3 కోసం కూడా రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. స్క్రిప్ట్ ను ఇప్పటికే ఆయన రెడీ చేసుకున్నట్లు సమాచారం. డైలాగ్ వెర్షన్ ను కంప్లీట్ చేయాల్సి ఉంది. అయితే అందుకు నీల్ ఒక ఏడాది టైమ్ తీసుకుంటారని టాక్ వినిపిస్తోంది. రీసెంట్ గా మెగా హీరో రామ్ చరణ్, నీల్ కాంబోలో మూవీ ఫిక్స్ అయిందని వార్తలు వచ్చాయి. డీవీవీ దానయ్య భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారని టాక్ వచ్చింది. అటు రామ్ చరణ్.. ఇటు నీల్ లైనప్ దృష్ట్యా.. 2029 లేదా 2030లో ఆ సినిమా మొదలు కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే సలార్ కన్నా ముందే చరణ్, నీల్ కలిసి సినిమా చేస్తారని వార్తలు వచ్చాయి. 2021లో ప్రాజెక్ట్ ఓకే అవుతుందని అంతా అనుకున్నారు. కానీ ఎందుకో సెట్ అవ్వలేదు. ఇప్పుడు మాత్రం చరణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తానికి ఐదారేళ్ల పాటు ప్రశాంత్ నీల్.. ఖాళీ లేకుండా వరుసగా స్టార్ హీరోలను ఫిక్స్ చేసుకున్నారు.

## సమంత.. ఖర్చు పెట్టడంలో బిజీబిజీగా..



సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ సమంత దశాబ్దం పాటు తెలుగు, తమిళ భాషలలో తిరుగులేని ఇమేజ్ తో నటిగా దూసుకుపోయింది. అయితే గత ఏడాది వచ్చిన 'ఖుషి' తర్వాత సమంత స్పీడ్ కి కాస్తా బ్రేక్స్ పడింది. ఈ బ్రేక్ కావాలని ఆమెనే తీసుకుంది. కొంతకాలం శారీరక, మానసిక ప్రశాంతత కోసం విశ్రాంతి తీసుకోవాలని డిసైడ్ అయ్యి కెరియర్ కి బ్రేక్ ఇచ్చింది. మరల ఇప్పుడు కథలు వింటుంది. బాలీవుడ్ లో కొన్ని ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్స్ లలో సమంత భాగం అయినట్లు టాక్ వినిపిస్తోంది. వెబ్ సిరీస్ లకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇంకా ఏవీ అధికారికంగా ఎనౌన్స్ కాలేదు. మరో వైపు సమంత సొంత ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. ట్రాలల మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ ప్రారంభించి 'మా ఇంటి బంగారం' అనే సినిమాని మొదటి ప్రాజెక్ట్ గా ఎనౌన్స్ చేసింది. ఫీమేల్ సెంట్రిక్ కథతో తెరకెక్కనున్న ఈ చిత్రంలో సమంత లీడ్ రోల్ లో నటిస్తోంది. అయితే ఈ మూవీ ప్రీప్రొడక్షన్ వర్క్ స్టేటస్ ఏంటనే దానిపై క్లారిటీ లేదు. ఇదిలా ఉంటే తన ప్రొడక్షన్ లో ఇతర హీరో, హీరోయిన్స్ తో కూడా సమంత మూవీస్ చేయాలని అనుకుంటుందంట. బ్యాక్ టూ బ్యాక్ ప్రాజెక్ట్స్ చేయాలని డిసైడ్ అయ్యిందంట. ఓ వైపు యాక్టర్ గా కొనసాగుతూనే మరో వైపు ఫుల్ టైమ్ ప్రొడ్యూసర్ గా మారాలని సమంత ఫిక్స్ అయినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తన ప్రొడక్షన్ లో రెండో సినిమాని ప్రియదర్శి హీరోగా కన్ఫర్మ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలో ఈ సినిమాకి సంబంధించిన అఫీషియల్ ఎనౌన్స్ మెంట్ రానుందని ఇండస్ట్రీ వర్గాలలో మాట్లాడుకుంటున్నారు. నిర్మాతగా తన బ్యానర్ లో కథ ప్రాధాన్యం ఉన్న చిత్రాలు చేయాలని సమంత అనుకుంటుందంట. మంచి కథ దొరికితే ఖర్చు చేయడానికి ఏమాత్రం వెనుకాడకుండా బిజీ అవుతున్నట్లు తెలుస్తోంది. ఆమె లేటెస్ట్ ట్రెండ్ కు తగ్గట్టుగా భిన్నమైన కథలు వినడానికే ఇష్టపడుతుందని చర్చ నడుస్తోంది. తెలుగుతో పాటు తమిళ్, హిందీ భాషలలో కూడా ఆమె మూవీస్ నిర్మించాలని ప్లాన్ చేసుకుంటుంది. బాలీవుడ్ లో చాలా మంది హీరోయిన్స్ యాక్టర్ గా కెరియర్ కొనసాగిస్తూనే ప్రొడ్యూసర్స్ గా మారుతున్నారు. ఇప్పుడు వారి బాటలోనే సమంత కూడా నిర్మాతగా సౌత్ లో సత్తా చాటే ప్రయత్నం చేస్తోంది. ఇక ఈమెని తెలుగులో హీరోయిన్ గా చూడాలని ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. సమంత కూడా రీసెంట్ గా 'జిగ్రా' మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ లో తెలుగులో సినిమాలు చేయడంపై అభిప్రాయాన్ని తెలిపింది. త్రివిక్రమ్ అడిగిన మాటకి తాను సిద్ధంగానే ఉన్నానని హింట్ ఇచ్చింది.

## శ్రీలీలా న్యూ లుక్.. ఆ డ్రెస్సుకే అందం వచ్చింది



అందాల భామ శ్రీలీల కమర్షియల్ హీరోయిన్‌గా నిలదొక్కుకోవాలని ప్రయత్నిస్తున్నా, ఆశించిన స్థాయిలో విజయాలు ఇంకా అందుకోలేకపోయింది. సూపర్ స్టార్ మహేష్ బాబుతో నటించిన "గుంటూరు కారం" సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకోగా ఈ చిత్రం అనుకున్నంత రేంజ్ లో సక్సెస్ కాలేదు. అంతేకాదు, సినిమాలో ఆమె పాత్ర కూడా ప్రధానంగా పాటలకే పరిమితమైందే తప్ప, నటనకు పెద్దగా అవకాశం దొరకలేదు. ఇక పవన్ కళ్యాణ్‌తో చేస్తున్న "ఉస్తాద్ భగత్ సింగ్" సినిమాపై కూడా కొంత ఆందోళన నెలకొంది, ఎందుకంటే ఈ మూవీ రిలీజ్ ఎప్పుడవుతుందన్నది ఇంకా స్పష్టంగా తెలియడం లేదు. ఈ నేపథ్యంలో, శ్రీలీల ప్రస్తుతం తన ఆశలన్నీ నితిన్ చేస్తున్న "రాబిన్ హుడ్" చిత్రంపైనే పెట్టింది. అలాగే మరో రెండు ప్రాజెక్టులు శ్రీలీల చేతిలో ఉన్నాయి. ఇక బాలీవుడ్‌లో కూడా ఆమె తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమైంది. బాలీవుడ్ లో ఒక యువ హీరోతో నటించడానికి శ్రీలీల గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని టాక్. ఈ సినిమాలో నటించడం ద్వారా బాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలని ఆమె ఆశిస్తోంది. శ్రీలీల మంచి డాన్సర్ అని తెలిసిందే. ఈ కారణంగా పలువురు నిర్మాతలు ఆమెతో ఐటెం సాంగ్స్ చేయాలని ఆసక్తిగా ఉన్నారు. కానీ శ్రీలీల మాత్రం ఇటువంటి పాటలలో నటించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. శ్రీలీలా తాజాగా షేర్ చేసిన ఫొటోలలో ఆమె గ్లామర్ పాత్రను మరింత హైలైట్ చేస్తూ కనిపిస్తుంది. ప్రకృతి సోయగాల మధ్య ఆమె వేసిన డిజైనర్ గౌన్, ఆత్మవిశ్వాసంతో కూడిన పోజులు అభిమానులను ఆకట్టుకున్నాయి. ఈ ఫొటోషూట్‌లో ఆమె ధరించిన ఎర్త్‌టోన్ గౌన్ సహజ సుందరత్వానికి మెరుగులు అద్దింది. గార్డెన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ లుక్ మరింత ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. ఈ ఫోటోలు ఆమె అభిమానులను బాగానే ఎట్రాక్ట్ చేస్తున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షల కొద్దీ లైకులు సాధించడమే కాదు, కామెంట్స్‌లో అభిమానులు ఆమె లుక్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. శ్రీలీలా తన అభిరుచి, ఫ్యాషన్‌ను ప్రతి ఫోటోలో ఎంతో ఇమిడ్చింది. మొత్తం మీద, ఈ లుక్ ఆమెకు ఒక ఫ్రెష్ అండ్ గ్లామరస్ టచ్ ఇచ్చిందని చెప్పవచ్చు.

## బాలకృష్ణ కోసం మరో మాస్ టైటిల్



నందమూరి బాలకృష్ణ, యంగ్ డైరెక్టర్ బాబీ (కేఎస్ రవీంద్ర) కాంబినేషన్ లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ సినిమా పై మాస్ ప్రేక్షకుల్లో అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నాగ వంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ దాదాపు పూర్తి కావచ్చింది. 'ఎన్బీకే 109' గా పిలవబడుతున్న ఈ సినిమా అప్‌డేట్స్‌పై ఇప్పటికే అభిమానులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు. తాజాగా, సినిమా టైటిల్‌ను అనౌన్స్ చేయడానికి మేకర్స్ సిద్ధమయ్యారు. దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా టీజర్ కూడా విడుదల చేయనున్నారు. ఇక ఫిల్మ్ సర్కిల్స్ లో అందిన సమాచారం ప్రకారం మాస్ టైటిల్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. కథకు తగ్గట్టుగా ఉండేలా, 'సర్కార్ సీతారాం' అనే టైటిల్‌ను లాక్ చేసారట. బాలకృష్ణ మాస్ ఇమేజ్ ను దృష్టిలో ఉంచుకొని పలు రకాల టైటిల్స్ పరిశీలించినా చివరికి ఈ టైటిల్‌కే ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఈ టైటిల్ బాలయ్య కెరీర్‌లో ఒక కొత్త ఎలివేషన్‌ను తీసుకురావడం ఖాయంగా కనిపిస్తోంది. సినిమాలో బాలకృష్ణ రోల్ ఎంతో ఆసక్తికరంగా ఉండబోతుందని సమాచారం. రాజస్తాన్ నేపథ్యంలో సాగే ఈ సినిమా కథలో బాలయ్య పాత్ర మాస్ ప్రేక్షకులకు ఎంతో విభిన్న అనుభూతిని పంచబోతుంది. చిత్రంలో బాలకృష్ణ సరసన బాలీవుడ్ బ్యూటీ ఊర్వశీ రౌతెలా నటిస్తుండగా, ఇతర ముఖ్యపాత్రలో చందినీ చౌదరి కనిపించబోతున్నారు. చిత్రంలో మరో ప్రత్యేక ఆకర్షణగా బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ కనిపించనున్నారు. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్న ఈ సినిమా, ఆయన నటనకు మరో కొత్త రంగును తీసుకురానుందని భావిస్తున్నారు. 'సర్కార్ సీతారాం' చిత్రంలో బాలయ్య పాత్రను ప్రేక్షకులు ఎంజాయ్ చేసే విధంగా స్టైలిష్ గా, అలాగే పవర్‌ఫుల్ మాస్ లుక్ లో చూపించబోతున్నారు. సినిమా షూటింగ్ పూర్తయిన వెంటనే, చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలు ప్రారంభించి, మరిన్ని అప్‌డేట్స్ ను వెల్లడించనుంది. ఈ సినిమాకి సంగీతం అందిస్తోన్న ఎస్. థమన్ ఇప్పటికే మూడు పాటలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు సినిమాకు బలమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కోసం వర్క్ చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని విజయ్ కార్తిక్ కన్నన్ అందిస్తున్నారు. సంక్రాంతి 2025 సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అనుకుంటోంది. సంక్రాంతి బరిలో రామ్ చరణ్ నటిస్తున్న 'గేమ్ చేంజర్' కూడా విడుదల కానుండగా, ఈ పోటీలో బాలయ్య సినిమా ఎలాంటి ప్రభావం చూపుతుందో అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బాలయ్య ఫ్యాన్స్ మాత్రమే కాకుండా, అన్ని వర్గాల మాస్ ప్రేక్షకులు సైతం సంక్రాంతికి 'సర్కార్ సీతారాం' సినిమాను చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## సుహాస్ సినిమా.. దిల్ రాజుకి ఎంత రావాలి?

యంగ్ హీరో సుహాస్ అందరికంటే వేగంగా మూవీస్ చేసుకుంటూ వెళ్తున్నాడు. తక్కువ బడ్జెట్ లో రియాలిటీకి దగ్గరగా ఉండే కథలు ఎంచుకుంటూ ప్రేక్షకులకి చేరువ అవుతున్నాడు. ఈ ఏడాది 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు', 'ప్రసన్నవదనం', 'శ్రీరంగనీతులు', 'గొర్రెపురాణం' సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఈ సినిమాలన్ని కూడా నేచురల్ కథలతో తెరకెక్కినవే కావడం విశేషం. ఇప్పుడు దిల్ రాజు ప్రొడక్షన్ లో 'జనక అయితే గనక' మూవీతో ప్రేక్షకులని పలకరించాడు. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైన్మెంట్ తో ఒక డిఫరెంట్ పాయింట్ ని ఈ సినిమాలో దర్శకుడు సందీప్ రెడ్డి బండ్ల చెప్పాలని అనుకున్నాడు. కానీ సినిమా ఆడియెన్స్ కు పెద్దగా కనెక్ట్ కాలేనట్లు అనిపిస్తోంది.. ప్రీమియర్స్ వేసినా కూడా మొదటి రోజు పెద్దగా రెస్పాన్స్ రాలేదు. మరి మిగతా రోజుల్లో ఏమైనా ప్రభావం చూపుతుందేమో చూడాలి. హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి దిల్ రాజు ప్రొడక్షన్ లో 'బలగం', 'లవ్ మీ' సినిమాల తర్వాత మూడో చిత్రంగా 'జనక అయితే గనక' వచ్చింది. జీవితంలో సరైన సంపాదన లేకుండా పిల్లలు వద్దనుకునే యువకుడి కథగా ఈ మూవీ ఉంటుంది. దసరా రేసులో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమాకి మౌత్ టాక్ ప్రధాన బలం. కానీ ఆడియెన్స్ నుంచి సరైన రెస్పాన్స్ అయితే లేదు. ఇక ఈ ఏడాది సుహాస్ నుంచి వచ్చిన నాలుగు సినిమాలలో కమర్షియల్ సక్సెస్ అందుకున్న మూవీ 'అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండు' మాత్రమే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY CHALLA SRIKANTH, PRINTED AT SRINIVASA PRINTERS D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA WEST,(U) VILLAGE, BAPATLA -522101, GUNTUR DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA -522101 GUNTUR DISTRICT, ANDHRA PRADESH,
EDITOR : CHALLA SRIKANTH, RNI : APBIL / 2023 / 86665, CELL: 6281086394 , emil srikanth9550389070@gmail.com